విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 268 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | బుధవారం 18 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


# బడులకు 5 స్టార్ రేటింగ్





- ప్రస్తుతం ఒక్కటీ లేదు.. అన్నింటినీ ఆ పరిధిలోకి తెస్తాం
- వెయ్యి కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
- వైసీపీ తెచ్చిన జీవో 117తో పిల్లలు బడికి దూరం
- కూటమి ప్రభుత్వం వచ్చాక రద్దు చేశాం
- 'వన్ క్లాస్-వన్ టీచర్' విధానం 33 శాతానికి పెంచాం: మంత్రి లోకేశ్
- 'నాడు-నేడు'లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి: గౌతు శిరీష

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ 5స్టార్ రేటింగ్‌లోకి తెస్తామని, రూ.వెయ్యి కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో మంగళవారం 'నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల ఆధునీకరణలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయని, ఆ పనులకు సకాలంలో బిల్లులు చెల్లించిన విషయం వాస్తవమేనా?' అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం చేపట్టిన తర్వాత కూడా 233 పాఠశాలల్ని మూసివేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన జీవో 117 వల్ల పేద పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ జీవో రద్దు చేశామని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎస్ఎంసీ అకౌంట్‌లో రూ.200 కోట్లు ఉన్నాయని, ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.800 కోట్లు అదనంగా కేటాయించామన్నారు. ఈ రెండూ కలిపి వచ్చే ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.1000 కోట్లు ఖర్చు చేసే అవకాశం వచ్చిందన్నారు. మరోవైపు పాఠశాలల విద్యాభివృద్ధిలో 'వన్ క్లాస్-వన్ టీచర్' విధానం చాలా కీలకమైందన్నారు. గతంలో 3 శాతం పాఠశాలల్లోనే ఈ విధానం ఉంటే.. ఇప్పుడు 33 శాతానికి పెంచామన్నారు. దీనిద్వారా మెరుగైన ఫలితాలు వస్తున్నాయన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించి ప్రధానంగా ఐదు అంశాలను పరిగణలోకి తీసుకున్నామని తెలిపారు. లీక్ ప్రూఫ్ బిల్డింగ్స్, పెయింట్స్, బెంచీలు, టాయ్‌లెట్స్, తాగునీరు అందించాలని నిర్ణయించామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలకు స్టార్ రేటింగ్ ఇస్తున్నామని, అన్ని పాఠశాలలను 5 స్టార్ రేటింగ్‌కు తేవాలన్నది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఇప్పటి వరకూ ఒక్క

- మిగతా 2లో...



## సుప్రీంకోర్టులో శ్రీలక్ష్మికి ఎదురుదెబ్బ

- ఓఎంసీ కేసును ట్రయల్ కోర్టులోనే తేల్చుకోవాలన్న అత్యున్నత న్యాయస్థానం
- గతంలో మరో పిటిషన్ అనుకుని స్టే ఇచ్చామన్న కోర్టు
- ఇన్నిరోజులు స్టేను ఎంజాయ్ చేశారు కదా అంటూ వ్యాఖ్య
- నిర్దోషిగా ప్రకటించాలన్న పిటిషన్ డిస్మిస్
- శ్రీలక్ష్మి మరిది అక్రమాస్తులు కూడబెట్టారు
- గనుల కేటాయింపులో లంచం అడిగారు
- విచారణలో అక్రమాలన్నీ బయటపడతాయి
- సుప్రీం కోర్టులో దర్యాప్తు సంస్థ వాదనలు

ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సీబీఐ కోర్టులో కేసు విచారణ దశలో ఉన్నందున, తామిప్పుడు మెరిట్స్‌లోకి వెళ్లలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టులోనే తేల్చుకోవాలని ధర్మాసనం తేల్చిచెప్పింది.

- మిగతా 2లో...

# తీరంలో యుద్ధ నౌకల జాతర

రాష్ట్రపతి విందుతో లాంఛనంగా ప్రారంభమైన ఐఎఫ్ఆర్

నేడు ఐఎన్ఎస్ సుమేధలో ప్రయాణించనున్న ద్రౌపదీ ముర్ము



ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం రాత్రి విశాఖ ఈఎన్‌సీ ఆఫీసర్స్ మెస్‌లో విందు (ప్రెసిడెన్షియల్ బాంక్వెట్) ఇచ్చారు. ఈ అంతర్జాతీయ ఉత్సవానికి హాజరవుతున్న వివిధ దేశాల నేవీ చీఫ్‌లకు దేశ రక్షణ దళాల సుప్రీం కమాండర్ హోదాలో రాష్ట్రపతి విందు ఇవ్వడం ఆనవాయితీ. ఈ విందుతో ఐఎఫ్ఆర్ లాంఛనంగా ప్రారంభమైనట్లు భావిస్తారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన సతీమణి అన్నా లెజినోవా, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, విశాఖ పోర్టు డిప్యూటీ ఛైర్మన్ రోషిణి అపరంజి, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.

- మిగతా 2లో...

## బంగ్లా ప్రధానిగా రహమాన్ ప్రమాణం



ఢాకా: బంగ్లాదేశ్ ప్రధానమంత్రిగా బీఎన్‌పీ నేత తారిఖ్ రహమాన్ (60) మంగళవారం పదవీ ప్రమాణం చేశారు. సంప్రదాయానికి

- మిగతా 2లో...

## ఆ యుద్ధ నౌకలు మునిగిపోవచ్చు ట్రంప్‌నకు ఖమేనీ హెచ్చరికలు



ఐఅమెరికా-ఇరాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోయడంలో అమెరికా ఎప్పటికీ విజయం సాధించబోదన్నారు. అంతేకాదు..

- మిగతా 2లో...

## ఐబొమ్మ రవికి కఠిన షరతుల బెయిల్



- ఇంటర్నెట్ వాడడానికి నిషేధం
- కోర్టుక పాస్ పోర్టు సరెండర్
- విదేశాలకు వెళ్లడానికి వీల్లేదు

సినిమా పైరసీ కేసులో సంచలనం సృష్టించిన 'ఐబొమ్మ' వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమంది రవికి ఎట్టకేలకు ఊరట లభించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అతనికి హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గత ఏడాది నవంబర్‌లో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రవిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

2

# వైసీపీ నేతలు సిగ్గులేకుండా ఎదురుదాడి చేస్తున్నారు

- లడ్డూ కల్తీని నాటి టీటీడీ చైర్మనే ఒప్పుకున్నారన్న అచ్చెన్న
- వైసీపీ నేతలు సిగ్గులేకుండా ఎదురుదాడి చేస్తున్నారని విమర్శ
- హెరిటేజ్‌పై ఆరోపణలకు దమ్ముంటే సభలో ఆధారాలు చూపాలని సవాల్
- జగన్ డిక్లరేషన్ ఇవ్వకపోవడాన్ని ప్రశ్నించిన మంత్రి
- తప్పు చేసిన వారు శిక్ష అనుభవిస్తారని హెచ్చరిక

- మిగతా 2లో...



## అదో తుగ్లకీయ కమిషన్

ఎన్నికల సంఘంపై మమత ఆరోపణ



కోల్‌కతా: ఎన్నికల సంఘం "తుగ్లకీయ కమిషన్"లా వ్యవహరిస్తోందని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారం

2

# సోషల్ మీడియాకు 'వయసు' కత్తెర



- కేంద్రం కీలక యోచన!
- చిన్నారుల వినియోగంపై పరిమితులు..
- టెక్ కంపెనీలతో చర్చలు
- డీప్‌ఫేక్‌లు, డిజిటల్ అడిక్షన్‌పై అశ్వినీ వైష్ణవ్ కీలక వ్యాఖ్యలు

సామాజిక మాధ్యమాల వినియోగం వల్ల తలెత్తుతున్న దుష్పరిణామాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకోబోతోంది. సోషల్ మీడియా వినియోగంపై వయసుల వారీ పరిమితులు (ఏజ్ బేస్డ్ రిస్ట్రిక్షన్స్) విధించే దిశగా అడుగులు వేస్తోంది. ఢిల్లీలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో భాగంగా కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు.

2

# భారత్ - ఫ్రాన్స్ సరికొత్త రక్షణ శకం

- రూ. 3.25 లక్షల కోట్ల రఫేల్ మెగా డీల్‌పై ముందడుగు..
- 114 యుద్ధ విమానాల కొనుగోలుకు రంగం సిద్ధం
- 96 విమానాలు భారత్‌లోనే తయారీ!
- మెక్రాన్‌తో ముంబైలో మోదీ భేటీ



2

# సుప్రీంకోర్టులో శ్రీలక్ష్మికి ఎదురుదెబ్బ

-మొదటిపేజీ తరువాయి

శ్రీలక్ష్మి పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటిస్తూనే సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో శ్రీలక్ష్మి పిటిషన్ విచారణ సందర్భంగా మరో పిటిషన్‌గా భావించి స్టే ఇచ్చామని ధర్మాసనం తెలిపింది. పొరపాటున ఇచ్చిన స్టేను ఇన్నిరోజులు ఎంజాయ్ చేసినట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. ఓబుళాపురం కేసులో తనను నిర్దోషిగా ప్రకటించాలని కోరుతూ శ్రీలక్ష్మి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, ఆ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు తీర్పును గతేడాది ఆగస్టు 12న శ్రీలక్ష్మి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ మంగళవారం జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. శ్రీలక్ష్మి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో అప్పటి రాష్ట్ర గనుల శాఖ మంత్రి (సబితా ఇంద్రారెడ్డి), అప్పటి ప్రభుత్వ కార్యదర్శి (కృపానందం) సహా కీలకంగా ఉన్నవారు అందరూ నిర్దోషులేనని తేలిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన కొత్తలో శ్రీలక్ష్మి వద్దకు ఆ ఫైల్ వచ్చిందని గుర్తు చేశారు. నిర్ణయాధికారంలోని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ కేసులో నిర్దోషులుగా తేలగా, ఒక ఆఫీసర్‌ను మాత్రం ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిప్పడం సరికాదన్నారు. "ఓఎంసీకి మైనింగ్ లీజులు ఇచ్చే సమయంలో.. ప్రభుత్వ ఉత్తర్వులో 'క్యాప్టివ్ మైనింగ్' (సొంత పరిశ్రమల అవసరాలకు మాత్రమే ఖనిజాన్ని వాడుకునే) అనే పదాన్ని ఉద్దేశపూర్వకంగానే శ్రీలక్ష్మి తొలగించి అక్రమాలకు పాల్పడ్డారని సీబీఐ ఆరోపిస్తోంది. అయితే, శ్రీలక్ష్మి కేంద్రం చెప్పినట్లు పనిచ్చస్త అది నిబంధనల ఉల్లంఘన అనడం సరికాదు. ఐరన్ ఓర్ అనేది మేజర్ మినరల్.

ఈ విషయంలో రాష్ట్రం సిఫారసులు మాత్రమే చేసింది. కావున, లీజుల కేటాయింపులో తుది నిర్ణయం కేంద్రానిదే. అసలు.. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలంటే లంచం అడిగి తీసుకున్నట్లు ఆధారాలు ఉండాలి. శ్రీలక్ష్మి విషయంలో ఎక్కడా డబ్బు చేతులు మారలేదు. నీరజ్ దత్తా కేసులో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు ప్రకారం.. ఆరోపణల ఆధారంగానే అవినీతి ముద్ర వేయజాలము" అని సిద్ధార్థ్ దవే వాదనలు వినిపించారు. సీబీఐ తన వాదనలు వినిపిస్తూ.. శ్రీలక్ష్మి సోదరి భర్త (రాకేష్ బాబు) 2005-09 మధ్య కాలంలో ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లింది. శ్రీలక్ష్మి గనుల

శాఖ కార్యదర్శిగా ఉన్న సమయంలో ఆమె మరిది భారీగా అక్రమాస్తులు కూడబెట్టారని తెలిపింది. గనుల కేటాయింపులో శ్రీలక్ష్మి కూడా లంచాలు డిమాండ్ చేసినట్లు సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారని కోర్టుకు వివరించింది. ట్రయల్ కోర్టులో విచారణలో అక్రమ వ్యవహారాలన్నీ బయటపడే అవకాశం ఉందని ధర్మాసనం దృష్టికి సీబీఐ తీసుకెళ్లింది. దీని వెనుక క్విడ్ ప్రో కో ఉందన్న కోణంలో విచారణ జరిగిందని గుర్తు చేసింది. శ్రీలక్ష్మిపై అవినీతి ఆరోపణలకు బలమైన ఆధారాలు ఉన్నాయని తెలిపింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. కేసు విచారణ దశలో ఉన్నందున, మెరిట్స్‌లోకి వెళ్లలేమని తెలిపింది. ఈ అంశాన్ని ట్రయల్ కోర్టులోనే తేల్చుకోవాలని చెబుతూ శ్రీలక్ష్మి పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ముగించింది.

# వైసీపీ నేతలు సిగ్గులేకుండా ఎదురుదాడి చేస్తున్నారు

:తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో వైసీపీ నేతలపై ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ.. లడ్డూలో కల్తీ జరిగిందని నాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డే స్వయంగా ఒప్పుకున్నాక కూడా, వైసీపీ నేతలు సిగ్గులేకుండా ఎదురుదాడి చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. "తప్పు ఒప్పుకున్నాక కూడా బుకాయిస్తారా? వైసీపీ నేతల్లారా సిగ్గుపడండి" అని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. కోట్ల మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసి, పవిత్ర ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వైసీపీకి ధర్మం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. ఈ సందర్భంగా గతంలో జగన్ తిరుమల పర్యటనను మంత్రి గుర్తుచేశారు. హిందూ సంప్రదాయాల ప్రకారం డిక్లరేషన్ ఇవ్వడానికి జగన్ ఎందుకు భయపడ్డారని ప్రశ్నించారు. అంతేకాకుండా, హెరిటేజ్ సంస్థపై అడ్డగోలు ఆరోపణలు చేయడం మానుకోవాలని, దమ్ముంటే కనీసం ఒక్క ఆధారమైనా చూపాలని వైసీపీకి సవాల్ విసిరారు. వ్యవస్థలను భ్రష్టు

పట్టించి, హిందూ ధర్మంపై దాడులకు పాల్పడిన ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని అచ్చెన్నాయుడు హెచ్చరించారు. సత్యం గెలిచి తీరుతుందని, తప్పు చేసిన వారు తప్పకుండా శిక్ష అనుభవిస్తారని ఆయన స్పష్టం చేశారు.

# బడులకు 5 స్టార్ రేటింగ్

-మొదటిపేజీ తరువాయి

పాఠశాల కూడా 5 స్టార్ రేటింగ్‌లో లేదన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత తమపై ఉందని, అవసరమైనచోట పాఠశాల భవనాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నిర్ణయించామన్నారు. 2014-19లో చేసిన పనులకు బిల్లుల చెల్లింపునకు చర్యలు చేపడతామన్నారు. తొలుత మాట్లాడిన గౌతు శిరీష గత ప్రభుత్వం నాడు-నేడు పేరుతో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిందని, నేటికీ అనేకచోట్ల అసంపూర్తి నిర్మాణాలు ఉన్నాయని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో 'నాడు-నేడు'లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలను పూర్తి చేయాలని కోరారు.

# ఆ యుద్ధ నౌకలు మునిగిపోవచ్చు ట్రంప్‌నకు ఖమేనీ హెచ్చరికలు

- మొదటి పేజి తరువాయి

ప్రపంచంలో బలమైన సైనిక శక్తి ఉన్నవాళ్లకూ తీవ్ర ఎదురుదెబ్బ తగలవచ్చన్నారు. ఇరాన్‌లో పాలన మార్పు, యుద్ధ నౌకల మోహరింపుపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేశారు. జెనీవా వేదికగా ఇరాన్-అమెరికాల మధ్య పరోక్ష అణు చర్చలు జరుగుతున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. "తమ సైన్యం ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదని అమెరికా అధ్యక్షుడు చెబుతున్నారు. అయితే, ఒక్కోసారి అది కోలుకోలేనంత దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఇరాన్ దిశగా యుద్ధ నౌకలను పంపించామని ప్రకటనలు చేస్తున్నారు. ఆ నౌకలు నిజంగా ప్రమాదకరమైనవి. కానీ, వాటిని సముద్రంలో ముంచేసే సామర్థ్యమున్న

ఆయుధం మరింత ప్రమాదకరం. 47 ఏళ్లుగా ఇస్లామిక్ రిపబ్లిక్‌ను ఏమీ చేయలేకపోయామని అమెరికా అంగీకరించడం శుభపరిణామం. ఎన్నటికీ ఏమీ చేయలేరు. అణు చర్చలు జరుపుదాం అంటున్నారు. కానీ, చివరకు మీ దగ్గర అణ్వాయుధాలు ఉండకూదని చెబుతున్నారు. చర్చల ఫలితాలను ముందుగానే నిర్ధరించడం తప్పిదం, మూర్ఖత్వమే" అని ఖమేనీ వరుస ట్వీట్లలో పేర్కొన్నారు.

**మూడు గంటల్లో ముగిసిన చర్చలు..**

జెనీవా వేదికగా అమెరికా-ఇరాన్ మధ్య జరిగిన అణు చర్చలు మూడు గంటల్లో ముగిశాయి. చర్చల సమయంలోనే హార్మూజ్ జలసంధిలో ఇరాన్ సైనిక విన్యాసాలు చేపట్టింది. ఈ సందర్భంగా జలసంధిని కొన్ని గంటల పాటు మూసివేసింది. ఈ క్రమంలో లైవ్ క్షిపణులను ప్రయోగించడం గమనార్హం. ఆ ప్రాంతంలో అమెరికా సైన్యాన్ని మోహరిస్తున్న వేళ టెహ్రాన్ ఈ చర్యలకు ఉపక్రమించింది.

# 'ఐబొమ్మ' రవికి బెయిల్ మంజూరు...

- మొదటి పేజి తరువాయి

దక్షిణ భారత సినిమాలు, ఓటీటీ కంటెంట్‌ను అక్రమంగా అప్‌లోడ్ చేస్తూ సినీ పరిశ్రమకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించాడనే ఆరోపణలతో రవిపై ఐదు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో అరెస్టయిన నాటి నుంచి రవి జైల్లోనే ఉన్నాడు. గతంలో అతని బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టు, హైకోర్టు తిరస్కరించాయి. తాజాగా మరోసారి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, కఠిన షరతులతో బెయిల్‌కు అంగీకరించింది.

కోర్టు విధించిన షరతులు

పాస్‌పోర్ట్‌ను కోర్టుకు సరెండర్ చేయాలి. ప్రతిరోజూ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసుల ముందు హాజరు కావాలి. కోర్టు అనుమతి లేకుండా

దేశం విడిచి వెళ్లరాదు. ఇంటర్నెట్ వినియోగించాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఈ నిబంధనలకు కట్టుబడి ఉండాలన్న ఆదేశాలతో రవి జైలు నుంచి బయటకు వచ్చేందుకు మార్గం సుగమమైంది. ఐబొమ్మ సైట్ వల్ల కొత్త సినిమాలు విడుదలైన గంటల్లోనే పైరసీకి గురవుతుండటంతో చిత్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోయింది. ఈ నేపథ్యంలో రవికి బెయిల్ లభించడం కేసులో కీలక పరిణామంగా మారింది.

# ఐదు నుంచి పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇళ్లు

- మొదటి పేజి తరువాయి

హౌసింగ్ పాలసీపై పొంగులేటి సమీక్ష నిర్వహించారు. మురికివాడల్లో నివసిస్తున్న పేదలు హైదరాబాద్ నగరానికి దూరంగా పోతే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందని ఇతర ప్రాంతాల్లో ఇళ్లను తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని హౌసింగ్ శాఖ అధికారులు మంత్రులకు వివరించారు. గతంలో 42వేల నివాసాలు నిర్మించగా అందులో సగం మంది మాత్రమే అక్కడ నివసిస్తున్నారని సర్వేలో తేలినట్లు చెప్పారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ "నిరుపేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారి నివాస ప్రాంతాలకు దగ్గరగా ఇళ్లను నిర్మించే ఆలోచన చేస్తున్నాం. మురికివాడల్లో స్థలం ఉన్నవారు అంగీకరిస్తే స్థానిక పరిస్థితులను బట్టి ఐదు నుంచి పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించే విధంగా ప్రణాళికలు జరుగుతున్నాయి. వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చించి దీనిపై తుది నిర్ణయం తీసుకుంటాం. నగరంలోని మూడు కార్పొరేషన్ల కమిషనర్లు, నాలుగు జిల్లాల కలెక్టర్లు సమన్వయంతో పని చేయాలి. ఆయా ప్రాంతాల్లో స్థలాలను గుర్తించాలి. అక్కడ ఎంత మంది లబ్ధిదారులు ఉన్నారు? ఎన్ని ఇళ్లను నిర్మించవచ్చు? వంటి వివరాలతో పది రోజుల్లో నివేదిక అందజేయాలి. శిథిలావస్థకు చేరిన జేఎన్ఎన్‌యూఆర్ఎం నివాసాల స్థానంలో కూడా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించే ఆలోచన చేస్తున్నాం.

**మధ్య తరగతి కోసం ఆర్ఆర్ఆర్-ఓఆర్ఆర్ పరిధిలో నివాసాలు..**

మూడు కార్పొరేషన్ల పరిధిలో ఇళ్ల స్థలాలు ఉన్న 28వేల మంది లబ్ధిదారులకు ఈ నెల చివరిలోగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేయాలి. అసంపూర్తిగా ఉన్న, ఇప్పటికే పూర్తయిన రెండు పడక గదుల ఇళ్లకు మార్చి చివరి నాటికి లబ్ధిదారులను ఎంపిక చేయాలి. అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేయడంతోపాటు మౌలిక వసతులకు హౌసింగ్ కార్పొరేషన్ నుంచి మంజూరు చేయాలి. విద్యుత్ పంపిణీ సంస్థలు మీటర్లను రెండు పడక గదుల లబ్ధిదారుల పేర్లమీదకు బదిలీ చేయాలి. ఆర్ఆర్ఆర్-ఓఆర్ఆర్ పరిధిలో మధ్య తరగతి ప్రజల కోసం గతంలో కేపీహెచ్‌బీలో నిర్మించిన మాదిరిగానే ఇళ్లను నిర్మిస్తాం. ఇందుకోసం నాలుగు ప్రాంతాల్లో స్థలాలను గుర్తించి పది రోజుల్లో నివేదిక అందించాలి" అని అధికారులకు మంత్రి పొంగులేటి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ శాఖ కార్యదర్శి గౌతమ్, మూడు కార్పొరేషన్ల కమిషనర్లు, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

## అధికారుల తీరుపై రేవంత్ అసంతృప్తి..

# సస్పెండ్ చేస్తానని వార్నింగ్

తెలంగాణలో పురపాలక శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో ఈరోజు నిర్వహించిన పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖపై సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచి ఫీల్డ్‌లో ఉండాలి. పారిశుద్ధ్యం, రోడ్ల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. రోడ్లు శుభ్రంగా లేకపోతే అక్కడిక్కడే అధికారులను సస్పెండ్ చేస్తాను" అని హెచ్చరించారు. నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లకు ఒక రోజు శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అధికారులకు కీలక సూచనలు చేశారు. నగరంలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ బాగా ఉన్న చోట్ల పీపీపీ విధానంలో స్కైవాక్ బ్రిడ్జిలు నిర్మించాలని చెప్పారు. నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అడ్వర్టైజింగ్ బోర్డుల నియంత్రణపై జాగ్రత్తలు తీసుకోవాలని... ప్రభుత్వ కార్యక్రమాలకు 10 శాతం బోర్డులు కేటాయించాలని అన్నారు. అనధికార బోర్డులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అడ్వర్టైజింగ్ బోర్డుల నుంచి సంవత్సరానికి ఒకసారి ఫీజు వసూలు చేయాలని సూచించారు. అన్ని పార్కుల వివరాలు సేకరించాలన్నారు.

## భారత్ - ఫ్రాన్స్ సరికొత్త రక్షణ శకం

ముంబై, ఫిబ్రవరి 17: భారత పర్యటనలో ఉన్న ఫ్రాన్స్ =ధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ తో ప్రధాన మంత్రి రేంద్ర మోదీ ముంబైలో భేటీ అయ్యారు. మూడు జుల పర్యటనలో భాగంగా సోమవారం రాత్రి మెక్రాన్ ముంబైకి వచ్చారు. దీంతో ప్రధాని మోదీ మహారాష్ట్ర కృవనకు మంగళవారం మధ్యాహ్నం చేరుకుని ఎక్రాను సాదర స్వాగతం పలికారు. లోక భవన్ వద్ద ధానికి మహారాష్ట్ర, గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ క్వాగతం పలికారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్తో మావేశమయ్యేందుకు ప్రదానమంత్రి మోదీ మహరాపభవన్కు చేరుకున్నారని, ఆయనకు సాదర స్వాగతం పలికామని ఆచార దేవ్ ప్రత్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. మెక్రాన్ తన పర్యటనలో భాగంగాఫస్ట్ లేడీ బ్రిగిట్టె మెక్రాన్తో కలిసి మంగళవారం ఉ దయం తేజ్ హోటల్ వద్ద 2008 ముంబై ఉగ్రదాడి మృతులకు నివాళులర్పించారు. మెక్రాన్ పర్యటనను స్వాగతిస్తూ ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా మంగళవారం ఉదయం పోస్ట్ పెట్టారు. మెక్రాన్కు స్వాగతమని, ఈ పర్యటనలో భారత్-ఫ్రాన్స్ సంబంధాలను మరో స్థాయికి తీసుకు వెళ్లేందుకు ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య చర్చలు వివిధ రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రపంచ పురోగతికి దోహదం చేస్తాయని విశ్వసిస్తున్నామని అన్నారు. ముంబై, ఢిల్లీలో మెక్రాన్తో భేటీ అయ్యేందుకు ఎదురుచూస్తున్నట్టు మోదీ పేర్కొన్నారు. మెక్రాన్ భారత్ పర్యటనలో భాగంగా ఈనెల 19న ఢిల్లీలో జరిగే 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో పాల్గొంటారు. మెక్రాన్ -మోదీ మధ్య జరిగే ద్వైపాక్షిక చర్చల్లో భారత్కు 114 రఫేల్ యుద్ధ విమానాల సరాఫరాకు ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. రూ.3.25 లక్షల కోట్ల విలువైన ఈ ఒప్పందం దేశ చరిత్రలోనే అతిపెద్ద రక్షణ ఒప్పందంగా నిలువనుంది.

## సోషల్ మీడియాకు 'వయసు' కత్తెర

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: సామాజిక మాధ్యమాల వినియోగం వల్ల తలెత్తుతున్న దుష్పరిణామాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకోబోతోంది. సోషల్ మీడియా వినియోగంపై వయసుల వారీ పరిమితులు (ఏజ్బేస్డ్రెస్ట్రిక్షన్స్) విధించే దిశగా అడుగులు వేస్తోంది. ఢిల్లీలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో భాగంగా కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు.

**అవసరమని భావిస్తున్నాం: కేంద్ర మంత్రి**

ప్రస్తుతం సోషల్ మీడియా వేదికలపై డీపేఫేక్ లు, అసభ్యకర కంటెంట్ పెరుగుతున్న నేపథ్యంలో వయసు ఆధారిత నియంత్రణలు తప్పనిసరి అని మంత్రి పేర్కొన్నారు. "మేం ప్రస్తుతం వివిధ సోషల్ మీడియా ప్లాట్ఫామ్లతో చర్చలు జరుపుతున్నాం. ఇప్పటికే ఆస్ట్రేలియా, ఫ్రాన్స్‌వంటి దేశాలు చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై నిషేధం లేదా కఠిన నియంత్రణలు విధించాయి. భారతదేశంలో కూడా ఇటువంటి నియంత్రణ వ్యవస్థ అవసరమని మేము భావిస్తున్నాం" అని ఆయన వివరించారు. ఇటీవల బడ్జెట్ సందర్భంగా ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే కూడా దేశంలో పెరుగుతున్న 'డిజిటల్ అడిక్షన్'పై ఆందోళన వ్యక్తం చేసింది. యువతలో స్మార్ట్ఫోన్ల వ్యసనాన్ని తగ్గించేందుకు వయసు ఆధారిత సోషల్ మీడియా అందుబాటు వ్యవస్థ ఉండాలని సిఫార్సు చేసింది.

పలువురు ఎంపీలు సైతం పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తడం గమనార్హం. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ప్రాథమిక సంప్రదింపుల దశలో ఉంది. కాగా, వినియోగదారుల వయసును ఎలా నిర్ధారించాలి? చిన్నారులకు హానికరమైన కంటెంట్ చేరకుండా టెక్ సంస్థలు ఎటువంటి సాంకేతిక మార్పులు చేయాలి? అనే అంశాలపై ప్రభుత్వం లోతుగా అధ్యయనం చేస్తోంది. త్వరలోనే దీనికి సంబంధించి ఒక సమగ్రమైన మార్గదర్శకాలను కేంద్రం విడుదల చేసే అవకాశం ఉంది.

## బంగ్లా ప్రధానిగా రహమాన్ ప్రమాణం

- మొదటి పేజి తరువాయి

భిన్నంగా బంగ భవన్‌ను కాదని జతియా సంసద్‌వద్ద ఉన్న దక్షిణ ప్లాజా బహిరంగ ఆవరణలో ఆయన ప్రమాణం చేశారు. అధ్యక్షుడు మహమ్మద్ షాబుద్దీన్ ఆయనతో ప్రమాణం చేయించారు. రహమాన్‌తోపాటు 25 మంది క్యాబినెట్, 24 మంది సహాయ మంత్రులు ప్రమాణం చేశారు. వివిధ పార్టీల నాయకులు, సైన్యాధికారులు, భారత లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీ, పాకిస్థాన్‌కు చెందిన పలువురు నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కొత్త క్యాబినెట్‌లో ఇద్దరు మైనారిటీ వర్గానికి చెందిన సభ్యులున్నారు. బీఎన్‌పీ ఉపాధ్యక్షుడు నితాయ్ రాయ్ చౌధురి, (హిందువు), దీపేన్ దివాన్‌లకు (బౌద్ధం) క్యాబినెట్‌లో చోటు దక్కింది. రహమాన్‌తో ఓం బిర్లా సమావేశమయ్యారు. ప్రధాని మోదీ అభినందనలను ఆయనకు తెలియజేశారు. భారత పర్యటనకు రావాలని ఆహ్వానించారు.

# అదో తుగ్లకీయ కమిషన్

- మొదటి పేజి తరువాయి

ఆరోపించారు. భాజపా ఆదేశానుసారం ఓటరు జాబితాల్లో మార్పు చేర్పులు చేస్తోందని విమర్శించారు. ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకొని ప్రజల్ని ఇబ్బందుల పాలుచేసిన దిల్లీ చక్రవర్తి సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్‌లా, జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్‌లా వ్యవహరిస్తూ కమిషన్ బెంగాల్ ఓటర్లను యాతనలకు గురిచేసిందని ముఖ్యమంత్రి విలేకరుల సమావేశంలో అన్నారు. ఈసీ నిబంధనల్ని ఉల్లంఘిస్తోంది, సుప్రీంకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తోంది, అది సృష్టించిన అయోమయం కారణంగా మరణాలు కూడా సంభవించాయి అని మమత పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఓటరు నిర్ధారణకు ఆమోదిస్తున్న డాక్యుమెంట్లను పశ్చిమ బెంగాల్‌లో ఆమోదించడం లేదని ఆమె తెలిపారు. బెంగాల్ భారతదేశంలో భాగం కాదా అని ప్రశ్నించారు. సర్ కారణంగా తలెత్తిన మానసికాందోళన, పని ఒత్తిడి బెంగాల్‌లో 160 మరణాలకు కారణమైందన్నారు.

# తీరంలో యుద్ధ నౌకల జాతర

ఈ సందర్భంగా చీఫ్ నేవల్ అధికారులు, ఫ్లీట్ కమాండర్లు, డీజీసీజీ, సీజీసీ(ఈఎస్), ఇతర కమాండర్లతో రాష్ట్రపతి గ్రూప్ ఫొటో దిగారు. అంతకుముందు దిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్న రాష్ట్రపతికి గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు స్వాగతం పలికారు.

**తుది సన్నాహకాలు పూర్తి**

ఐఎఫ్ఆర్‌లో భాగంగా బుధవారం ఐఎన్ఎస్-సుమేధ నౌకపై రాష్ట్రపతి ప్రయాణిస్తారు. ఆరు వరుసల్లో నిలిపిన 71 యుద్ధనౌకల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలో మంగళవారం నౌకా దళం నిర్వహించిన తుది సన్నాహక విన్యాసాలను నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్ఎస్ విక్రాంత్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. విక్రాంత్‌పైకి మిగ్-29 జెట్ విమానాలు చేసిన ల్యాండింగ్, టేకాఫ్ విన్యాసాలు సందర్శకులను మైమరిపించాయి. రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ.. తదితర దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు 7 ఫ్లీట్ రివ్యూలో పాల్గొననున్నాయి.

**విశాఖ విమానాశ్రయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

బుధవారం జరిగే ఫ్లీట్ రివ్యూలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం రాత్రి విశాఖ చేరుకున్నారు. ఎంపీ శ్రీభరత్, జిల్లా ఉన్నతాధికారులు, నేవీ అధికారులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి సీఎం నేరుగా పోర్టు గెస్ట్‌హౌస్‌కు వెళ్లారు.

విందు అనంతరం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మతో ఉపముఖ్యమంత్రి

పవన్ కల్యాణ్, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠి, గవర్నర్ అబ్దుల్ నజీర్, తూర్పు

నౌకాదళ ప్రధాన అధికారి వైస్ అడ్మిరల్ సంజయ్‌భల్లా, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ వివిధ దేశాల నౌకాదళ అధికారులు, కమాండోలు

# రిజర్వాయర్ ప్రాజెక్టు పురోగతి పై మంత్రి రామానాయుడుతో, సత్య కుమార్ యాదవ్

- జిల్లేడుబండ రిజర్వాయర్ వేగవంతానికి కీలక చర్చలు.
- 23 వేల ఎకరాలకు సాగునీరుడ ప్రాజెక్టు పురోగతి పై మంత్రుల సమీక్ష.
- ప్రజల నీటి భద్రతే లక్ష్యం జిల్లేడుబండ ప్రాజెక్టు పై సత్యకుమార్ దూరదృష్టి.
- రైతు, ప్రజల సంక్షేమమే ప్రాధాన్యం మంత్రి సత్యకుమార్ సమగ్ర సమీక్ష.
- నిధులు అడిగేవారిని చూశానుడ కానీ ఫలితాలు ఆలోచించే నాయకుడు సత్యకుమార్ మంత్రి రామానాయుడు ప్రశంసలు
- ఎంతమందికి లాభం? ఎలా అభివృద్ధి? ఇలా ఆలోచించే తొలి నాయకుడు సత్యకుమార్ అని రామానాయుడు ప్రశంస



**సత్యసాయి జిల్లా, పెన్ సత్తా, ఫిబ్రవరి 17:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అసెంబ్లీ లాబీలో మంగళవారం ఉదయం జలవనరుల శాఖ మంత్రి నిమ్మకాయల రామానాయుడుతో ముదిగుబ్బ మండలం, జిల్లేడుబండ రిజర్వాయర్ ప్రాజెక్టు పురోగతి గురిశీచి చర్చించారు. హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు పరిధిలో చేపట్టిన జిల్లేడు బండ రిజర్వాయర్ ద్వారా సుమారు 23,000 ఎకరాలకు సాగునీరు, అలాగే తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు మొత్తం 2.41 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కల్పించే అంశం పై సమగ్రంగా చర్చించారు. ఇప్పటికే సుమారు రూ.200 కోట్లు అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్ మంజూరు అయిన నేపథ్యంలో, మిగిలిన నిధులు విడుదల చేసి ప్రాజెక్టును వేగవంతం చేయాలనే అంశం వారి మధ్య ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. విడుదలయ్యే నిధులను సమర్థవంతంగా వినియోగించి ఎంత మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలుగుతుందో, ప్రాంతీయ అభివృద్ధికి ఎలా దోహదపడుతుందో మంత్రి సత్యకుమార్ యాదవ్ మంత్రి రామనాయుడుకు వివరించారు. గత ప్రభుత్వ కాలంలో వ్యక్తిగత ప్రయోజనాల కారణంగా జరిగిన లోపాలను కూడా చర్చలో ప్రస్తావిస్తూ, ప్రాజెక్టు పూర్తయితే సుమారు 1.50 లక్షల మందికి సాగునీటి లాభం, 5 లక్షల మందికి తాగునీటి ప్రయోజనం కలుగుతుందని మంత్రి సత్య కుమార్ పేర్కొన్నారు. మంత్రి సత్యకుమార్ ను అభినందించిన రామానాయుడు, మంత్రి రామానాయుడు స్పందిస్తూ ఇప్పటివరకు నన్ను ఇన్ని కోట్లు ఇవ్వండి అని మాత్రమే అడిగిన వారినే చూశాను కానీ, విడుద లైన నిధులను ఎలా వినియోగించాలి, దాని ద్వారా ఎంతమందికి లాభం చేకూరుతుంది, భవిష్యత్ అభివృద్ధి దిశ ఏమిటి అని ఆలోచించి వివరంగా చర్చించిన తొలి వ్యక్తి మీరు అంటూ మంత్రి సత్యకుమార్ యాదవ్ ని ప్రశంసించారు. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగే నాయకత్వానికి ఇది నిదర్శనమని రామానాయుడు అభిప్రాయపడ్డారు.

# పదవ తరగతి, ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి.

- జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్.



**అనకాపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 17:** జిల్లాలో పదవ తరగతి, ఓపెన్ స్కూల్ పదవ తరగతి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 16 వ తేది నుండి, మార్చి 29 వ తేది వరకు జిల్లాలో 102 పరీక్ష కేంద్రాలలో ఉదయం 9.30 గంటల నుండి, మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తున్నారు. పదవ తరగతి పరీక్షలకు జిల్లాలో రెగ్యులర్ విద్యార్థులు 20,577 మంది, ప్రయివేట్ విద్యార్థులు 440 మంది మొత్తం 21,017 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. జిల్లాలో ఓపెన్ స్కూల్ పదవ తరగతి పరీక్షలను మార్చి నెల 16 వ తేదీ నుంచి, ఏప్రియల్ నెల 1 వ తేదీ వరకు ఉదయం 09:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 71 ఓపెన్ స్కూల్ పదవ తరగతి కి చెందిన 531 మంది విద్యార్థులు జిల్లాలో 102 పరీక్ష కేంద్రాలలో పరీక్షలను రాయనున్నారని, జిల్లాలో 38 ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ కి చెందిన 1,398 మంది విద్యార్థులుకు గాను జిల్లాలో 6 పరీక్ష కేంద్రాలలో మార్చి 2 వ తేదీ నుంచి, మార్చి 13 వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి, మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

సమన్వయంతో అధికారులందరూ పనిచేసి విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్షా కేంద్రలలో అన్నిసౌకర్యాలను కల్పించాలన్నారు. ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పరీక్షలు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో పక్కాగా ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలలో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారి జి అప్పారావు నాయుడును కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగా చేరుకునేలా బస్సులను ఏర్పాటు చేయాలని ప్రజా రవాణాశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేసారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు ఏర్పాటు చేయాలని, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి అవసర మైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షను అమలు చేయాలని, పరీక్షా కేంద్రాలకు దగ్గరలోని జెరాక్స్ సెంటర్లను పరీక్షల సమయంలో మూసివేయాలని తెలిపారు. పరీక్షా పత్రాలకు, తనిఖీ బృందాలకు ఎస్కార్ట్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు తెలిపారు. పరీక్షల నిర్వహణ తనిఖీ చేయుటకు సిట్టింగు, ఫ్లయింగు స్క్వాడ్ లను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణ అనంతరం జవాబు పత్రాల బండిల్స్ సకాలంలో పంపించుటకు పరీక్షల నిర్వహణ అధికారులకు తపాలా శాఖ సిబ్బంది సహకరించాలని కలెక్టర్ తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఆయా శాఖలకు కేటాయించిన పనులను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పరీక్షలను సమర్ధవంతంగా నిర్వహించాలని కోరారు. ప్రైవేటు పాఠశాలలతో ఎక్కడా మాస్ కాపీయింగు జరుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు, పర్యవేక్షణ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక కేంద్రాలలో అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టరు తెలిపారు. ఈ సమావేశంలో ఇంచార్జి డి.ఆర్వో శ్రీనివాస్, డి ఈ ఓ., జి. అప్పారావు నాయుడు, డి ఐ ఈ ఓ,. వినోద్ బాబు, జిల్లా రవాణా, ప్రజా రవాణా శాఖ అధికారులు జి. మనోహర్, వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు, ఎలక్ట్రికల్, తపాలా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మహిళా ఉద్యోగుల భద్రతే లక్ష్యంగా శక్తి యాప్





అచ్యుతాపురం బ్రాండిక్స్ లో భారీ అవగాహన సదస్సు.

**అచ్యుతాపురం, పెన్ సత్తా, ఫిబ్రవరి 17:** పరిశ్రమల్లో పనిచేసే మహిళా ఉద్యోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, వారి రక్షణే జిల్లా పోలీసు యంత్రాంగం తొలి ప్రాధాన్యత అని పోలీస్ అధికారులు స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, అచ్యుతాపురం బ్రాండిక్స్ కంపెనీ లోని యూనిట్ 2 లో మహిళా ఉద్యోగులకు చట్టాలు, రక్షణ, మార్గాల పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఈ.శ్రీనివాసులు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ ఎస్సై పి.రాములమ్మ పాల్గొని కీలక సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు రక్షణ కవచంలా పనిచేసే 'శక్తి' యాప్ ను ప్రతి మహిళా ఉద్యోగి మొబైల్ లో ఉండాలని అధికారులు సూచించారు. ఒక్క బటన్ నొక్కితే నిమిషాల్లో పోలీసు సహాయం అందుతుందని వివరించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం, ఫోటోలు షేర్ చేయవద్దని హెచ్చరించారు. వేధింపులకు గురయ్యే మహిళలకు భద్రతకు టోల్ ఫ్రీ నెంబర్ 181 ద్వారా ఉచిత న్యాయ, వైద్య, కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని ఎస్సై రాములమ్మ తెలిపారు. పని ప్రదేశాల్లో లేదా బయట వేధింపులు ఎదురైతే భయపడకుండా ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు దారుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. మీ భద్రతే మా బాధ్యత, వేధింపులను మౌనంగా భరించవద్దు, ధైర్యంగా పోలీసులను ఆశ్రయించండి. జిల్లా పోలీస్ యంత్రాంగం అనంతరం మహిళా ఉద్యోగులు అడిగిన పలు సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల పై లోకేష్ కు పాలాభిషేకం





**గన్నవరం, పెన్ సత్తా, ఫిబ్రవరి 17:** నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో 20 నెలల కాలంలో రూ.2,986 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేసినందుకు గన్నవరం నియోజకవర్గ తెలుగు యువత, ఐటిడిపి, టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కూటమి సర్కార్ ఇది స్టూడెంట్ సర్కార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎనికేపాడు లోని ఎస్ఆర్కే ఇంజనీరింగ్ కళాశాల, తేలప్రోలు లోని ఉషారామ కాలేజీల ప్రాంగణం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువత, నాయకులు, మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల పై ఉన్న ఆర్థిక భారం తగ్గిందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఈ పథకం ద్వారా లాభం చేకూరుతోందని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో బకాయిల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితి మెరుగుపడిందన్నారు.

కార్యక్రమంలో తెలుగు యువత నాయకుడు చల్లగుళ్ల సందీప్, కొసరాజు సాయిరాం, తాటిపాముల నాగయ్య, వంగ అయ్యప్ప రెడ్డి, చరణ్, ఐటిడిపి సభ్యులు ముక్కపాటి చైతన్య, రాజేష్, మోహన్, వెంకన్న, టీఎన్ఎస్ఎఫ్ సభ్యులు గోగం వెంకట్రామ్, కలపర్తి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్న చిన్నా



**పరవాడ, పెన్ సత్తా, ఫిబ్రవరి 17:** మండలం లోని ఈదులపాక బోనంగి గ్రామంలో పోలమాంబ అమ్మవారి పండుగ మహోత్సవ సందర్భంగా వియ్యపు చిన్నా (మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు) గండి వంశీ తో కలిసి పోలమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి ని దర్శించుకొన్నారు. ఈ కార్యక్రమంలో బుగుడి రామ గోవిందరావు(జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి, ఉత్సవ కమిటీ చైర్మన్ ), డి నాగేశ్వర రావు (టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు), చందనాటి గోవింద్ రాజులు, చందనాటి మురళీ (ఉపాధ్యక్షులు), మత్తురతి శ్రీనివాస్, మంత్రి గిరి ప్రసాద్, అట్ట నూకరాజు, దామురోతి నరసింగరావు, సలాది శ్రీనివాసరావు, సలాది సాయి, మంత్రి శ్రీనివాస్ రావు, చందక శేఖర్, చందక అశోక్, చందక రమేష్, దామురోతి హర్ష వర్ధన్, గ్రామ టిడిపి నాయకులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

# పైడిమాంబ అమ్మవారి పండుగ మహోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



**పరవాడ, పెన్ సత్తా, పిబ్రవరి 17:** గ్రామం సంత బయలు వద్ద గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి పండుగ మహోత్సవం సందర్భంగా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వై.సి.పి రాష్ట్ర కార్యదర్శి పయిల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరిపురపు అప్పల నాయుడు, చేతుల మీదుగా పండుగ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా నిర్వహించే గ్రామ దేవత పైడిమాంబ ఆశీస్సులతో గ్రామంలో శాంతి, సుభిక్షాలు నెలకొనాలని ఆకాంక్షించారు. పైడిమాంబ అమ్మవారి పండుగ గ్రామ ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని, ఈసారి కూడా భక్తి శ్రద్ధలతో మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, పయిల పోతు నాయుడు, పయిల సన్యాసిరావు మాస్టారు, వార్డు మెంబర్ లు పోతల అప్పల నాయుడు, గండి ఈశ్వరరావు, చల్ల కనకరావు, పయిల రామ చంద్ర రావు, మండల ప్రధాన కార్యదర్శి పయిల రాధ కృష్ణ, సిరిపురపు అయ్యబాబు, పయిల అప్పారావు, వర్రీ హరి, బండారు రాజు, రెడ్డి చిన్న, తదితరులు పాల్గొన్నారు.

## నూకతాత పండగలో వైసీపీ నేతలు



**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 17:** మత్స్యకార గ్రామం రాజీవ్ పేటలో జరిగే నూక తాత పండగలో వైసీపీ నేతలు పాల్గొన్నారు. పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో పలు వైసీపీ నాయకులు నూక తాతను దర్శించుకున్నారు. జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ తో కలసి నూక తాత ప్రతిమలను తలపై పెట్టుకుని మోసి నూక తాత ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, వెలగ ఈశ్వరరావు, గొర్ల గోవిందు, రాజయ్యపేట ఎంపీటీసీ పికితాతీలు, నాయకులు పొడకట్ల పాపారావు, గంటా తిరుపతిరావు, మన బాల తాతారావు,ఎల్లేటి సత్యనారాయణ, స్థానిక మత్స్యకార నాయకులు తదితరులు ఉన్నారు.

## దళితుల సాగు భూములకు పరిహారం చెల్లించాలి

**తహసిల్దార్ కార్యాలయంలో వినతి**



**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 17:** మండలంలో దళితులు సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో డిఎల్ పురం గ్రామానికి చెందిన సుమారు 75 కుటుంబాలకు చెందిన దళిత రైతులు నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ85/6 సర్వే నెంబర్లో సుమారు6.56 ఎకరాల ప్రభుత్వ భూములో ఎన్నో ఏళ్లగా తమ కుటుంబాలు జీడి మామిడి తదితర పంటలు వేసుకుని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. దీనినే నమ్ముకుని ఆధారపడి ఉన్న దళిత కుటుంబాలకు నష్టపరిహారం అందజేయాలని ఈ భూమిలో ఉన్న చెట్లకు పరిహారం చెల్లించి తమ కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. వీరంతా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్ నారాయణరావుకు వింత పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వెలగ ఈశ్వరరావు, పొడకట్ల పాపారావు, సాదిరెడ్డి శ్రీను, గొర్ల గోవిందు, దళిత నాయకులు పాల్గొన్నారు.


## మెదడుకు పదును చదరంగం

**బాపట్ల ఆర్డీఓ పీ గ్లోరియా**




**బాపట్ల,పెన్ సత్తా, ఫిబ్రవరి 17:**మెదడుకు పదును పెట్టే క్రీడల్లో చదరంగం ముందు వరుసలో ఉంటుందని బాపట్ల ఆర్డీఓ పీ గ్లోరియా అన్నారు.మంగళవారం బాపట్ల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైన జిల్లాస్థాయి చదరంగం పోటీల ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆర్డీఓ గ్లోరియా మాట్లాడుతూ చదరంగం క్రీడలో రాణించేవారు తెలివైన భావాలతో ఉంటారని పేర్కొన్నారు.క్రీడల్లో అద్భుతంగా రాణించే వారికి భవిష్యత్తులో ఎన్నో అవకాశాలు పుష్కలంగా ఉంటాయని అన్నారు.జిల్లాస్థాయి చదరంగం క్రీడా పోటిల్లో పాల్గొన్న క్రీడాకారులను ఈ సందర్భంగా ఆర్డీఓ గ్లోరియా అభినందించారు.బాపట్ల తహసీల్దార్ ఎస్ కె సలీమా మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన క్రీడల ద్వారా విద్యార్థులు మంచి ఉన్నత భవిష్యత్తుకు మార్గం సుగమం చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు.చదరంగం క్రీడల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.బాపట్ల మునిసిపల్ కమీషనర్ జీ రఘునాథరెడ్డి మాట్లాడుతూ బాపట్లలోని క్రీడా స్టేడియంను అన్ని విధాల అభివృద్ధి చేసి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా కలెక్టర్ సహకారంతో అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.క్రీడా రంగాన జాతీయస్థాయిలో ప్రతిభా పాటవాలు ప్రదర్శిస్తున్న క్రీడాకారులను ఈ సందర్భంగా కమీషనర్ అభినందించారు.డీఎస్డీఓ ఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయస్థాయి క్రీడా విజేత అనురాధ రెడ్డి,జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 108 మంది విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజయ్యపేటలో అంబరాన్నింటిన నూకతాత సంబరాలు





- భక్తులపై నుండి నడుచుకుంటూ వచ్చిన పూజారులు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 17:**
మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో మత్స్యకారుల ఆరాధ్యదైవం నూక తాత సంబరాలు అంబరాన్నాంటాయి. మంగళవారం వేలాదిమంది భక్తుల నడుమ నూకతాత పండగ వైభవంగా జరిగింది. ప్రతీ ఏటా మహాశివరాత్రి తరువాత వచ్చే అమావాస్య రోజున నూకతాత పండుగ నిర్వహించడం పూర్వం నుండి ఆనవాయితీగా వస్తుంది. దీనిలో భాగంగా సోమవారం పెద్ద ఎత్తున జాతర నిర్వహించారు. స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుండి వేలాదిమంది రావడంతో రాజయ్యపేట భక్తులతో కిక్కిరిసిపోయింది. గ్రామస్తులతో పాటు పూరి, పారదీప్ తదితర ప్రాంతాలకు వలసలు వెళ్లిన మత్స్యకారులు కూడా ఈ జాతరలో పాల్గొన్నారు. నూకతాత ఆలయాన్ని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలో భారీ ఎత్తున విద్యుత్ దీపాలంకరణ, లక్షల రూపాయల వ్యయంతో రాత్రి భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి తెల్లవార్లు జాతర నిర్వహించారు.

**"""భక్తులపై నుండి నడిచి వచ్చిన నూకతాత"""**

మత్స్యకారుల ఆరాధ్య దైవం నూక తాత భక్తులపై నుండి నడుచుకుంటూ వచ్చారు. తరాలుగా వస్తున్న సాంప్రదాయంలో భాగంగా నూకతాత ప్రతిమలను ఆలయం నుండి రాజయ్య పేటకు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న బోయపాడు సముద్ర తీరానికి తీసుకెళ్లి పుణ్య స్నానాలు చేయించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడనుండి ఆలయానికి తీసుకొచ్చే క్రమంలో దారి పొడవునా వస్త్రాలు పరిచి ఆడ, మగ, చిన్న,పెద్ద తేడా లేకుండా సుమారు ఐదు కిలోమీటర్ల మేర భక్తులు నెల పై పడుకుని ఉంటారు. నూకతాత ప్రతిమలను, రామ దీపాన్ని మత్స్యకారులు మేళతాళాలతో ముందు తీసుకెళుతుండగా నూకతాత పూజారులు భక్తులను తొక్కుకుంటూ నడిచి వెళ్తారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు భక్తులు పోటీపడి భక్తులు ముందుగానే వస్త్రాలను నేలపై వేస్తారు. అలా భక్తులను తొక్కుకుంటూ ఆశీర్వదిస్తూ వెళ్లడం వల్ల మత్స్యకార కుటుంబాలు, భక్తులు సుఖశాంతులతో ఉండి కోరిన కోర్కెలు తీరుతాయని వారి నమ్మకం. దీంతో ఆ ప్రాంతమంతా నూకతాత నామస్మరణతో ఆధ్యాత్మికంగా మారింది. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నక్కపల్లి సిఐ మురళి, ఎస్ ఐ సన్నిబాబుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ పండగలో గంగా స్నానానికి వెళ్లిన భక్తులకు పులిహోర, మజ్జిగ, త్రాగునీరు లను పలువురు భక్తులు ఏర్పాటు చేశారు.

**" మద్యం, మాంసాహారం ముట్టని మత్స్యకారులు "**

ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకొనే నూకతాత పండగ సందర్భంగా జాతర జరిగే రెండు రోజులపాటు గ్రామస్తులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన మత్స్యకారులు కూడా మద్యం, మాంసాహారం ముట్టుకోమని మత్స్యకారులు తెలిపారు.

# శాసనమండలిలో రభస చేయించి జగన్ ఇంట్లో నవ్వుకుంటున్నారు

- ప్రజా సమస్యల మీద, రాష్ట్ర బడ్జెట్ మీద చర్చించే ఓపిక వైసీపీకి లేదు.
- చైర్మన్ పోడియం మీదకు వైసీపీ ప్రజా ప్రతినిధులు ఎక్కడాన్ని జనసేన పార్టీ ఖండిస్తోంది.
- విలువైన సభా సమయాన్ని వైసీపీ కావాలని వృథా చేస్తోంది.
- అసెంబ్లీ మీడియా పాయింట్ లో మాట్లాడిన జనసేన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, నిమ్మక జయకృష్ణ.





**అమరావతి, పెన్ సత్తా, పిబ్రవరి 17:**ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని రూపొందించిన బడ్జెట్ మీద చర్చించాల్సిన విపక్ష పార్టీ తన సంఖ్యా బలం ఎక్కువగా ఉందని శాసన మండలిలో రభస చేస్తోంది. పార్టీ ఎమ్మెల్సీల చేత పోడియం ఎక్కించి మరీ సమావేశాలకు అంతరాయం కలిగించి ఆ పార్టీ నాయకుడు జగన్ వికృతానందం పొందుతున్నారని విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం అసెంబ్లీ లోని మీడియా పాయింట్ వద్ద ఆయన పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని, అన్ని రంగాలను అభివృద్ధి వైపు నడిపించేలా రాష్ట్ర బడ్జెట్ ఉంది. పాలన వ్యవహారాల్లో ఆధునిక టెక్నాలజీకి అధిక ప్రాధాన్యమిచ్చేలా, పోలవరం అమరావతి వంటి ప్రాజెక్టులు పూర్తిచేసేలా బడ్జెట్లో కేటాయింపులు చేశారు. బీసీ వర్గాలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ సుమారు రూ.50 వేల కోట్లకు పైగా బడ్జెట్లో కేటాయించడం ఆహ్వానించదగ్గ విషయం. ఇలాంటి ఎన్నో అంశాలు బడ్జెట్లో ఉన్నాయి. దీని మీద చర్చించాల్సిన వైసీపీ శాసనమండలిలో తన బల ప్రదర్శన చేయడానికి ఎక్కువ ఆరాటపడుతోంది. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, భవిష్యత్తు వైపు ప్రణాళిక లక్ష్యంతో రూపొందించిన బడ్జెట్ మీద సుహృద్భావ వాతావరణంలో చర్చించే ఓపిక వైసీపీకి లేదు. శాసనమండలిలో రభస చేయించి, బడ్జెట్ మీద కావాలనే వైసీపీ పక్కదోవ పట్టించింది. వైసీపీ పార్టీ నాయకుడికి గొడవ, గోల లేకపోతే నిద్ర పట్టదు. విలువైన సభా సమయాన్ని కావాలనే వైసీపీ నాశనం చేస్తోంది అన్నారు. ఇదేం పద్ధతి? నిమ్మక జయకృష్ణ. అనంతరం పాలకొండ శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ శాసనసభలో తమకు సరైన సమయం ఇవ్వడం లేదంటూ గెలిచిన 11 మంది సభ్యులు శాసనసభకు రాకుండా మానేశారు. అదే శాసనమండలిలో ఎక్కువ మంది సభ్యులు ఉండి, చర్చించేందుకు తగినంత సమయం ఉన్నా కూడా బడ్జెట్ మీద చర్చను వైసీపీ పక్క దోవ పట్టించింది. వైసీపీకి కావలసింది కేవలం సభలో రభస చేయడం తప్ప ప్రజా సమస్యలను చర్చించి పరిష్కరించే ఉద్దేశం లేదు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి మీద దృష్టి పెట్టింది. దానికి సమగ్ర ప్రణాళికతో బడ్జెట్ రూపొందించింది. దీని పై మాట్లాడేందుకు వైసీపీ నేతలకు ధైర్యం సరిపోక కావాలనే సభలో రచ్చ చేస్తున్నారు. అప్రజాస్వామిక రీతిలో చైర్మన్ పోడియం ఎక్కి మరి శాసనమండలిలో రభస చేసిన వైసీపీ తీరును జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది అన్నారు.

# ఘనంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం.



**ముఖ్య అతిధులుగా రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాధం (జగన్)**

**గాజువాక, పెన్ సత్తా, పిబ్రవరి 17:** నియోజకవర్గం 87 వ వార్డ్ పరిధిలో మండల ప్రాథమిక పాఠశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాధం (జగన్) పాల్గొని ముందుగా పాఠశాలలో ఉన్న విద్యార్థుల కు వైద్యులు నిర్దేశించిన ఆల్బెండజోల్ మాత్రలను పిల్లలకు యువ్వడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిధులు మాట్లాడుతూ ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలకు ఈ ఆల్బెండజోల్ మాత్రలను తప్పనసరిగా వేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ప్రఠశాలల అభివృద్ధి కోసం పెద్దపిట వేస్తుందని అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తుందని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు కె. ధనలక్ష్మి మాట్లాడుతూ నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, ఆకలి మందగించడం, శారీరక, మానసిక ఎదుగుదల లోపించడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఈ మాత్రలను ఖాళీ కడుపుతో కాకుండా, భోజనం చేసిన తర్వాత వేసుకోవాలి.వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా నులిపురుగుల వ్యాప్తిని అరికట్టవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు విజయరామరాజు, సెక్రటరీ బొట్టా ప్రకాష్,రాజన్ రాజు, డీవీ అప్పారావు, వర్రే రాంబాబు, పావడా వెంకటరమణమూర్తి,కళ్లేపల్లి శ్రీనివాసవర్మ,జాన్ రమేష్,మజ్జి పద్మ,కోరుకొండ కళ్యాణ్ చక్రవర్తి, దాలయ్య,దేముడు, మూర్తి, ఆదినారాయణ,వైద్యులు, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపమాక స్మశాన వాటిక సీసీ రోడ్ నిర్మాణం



**నక్కపల్లి, పెన్ సత్తా, ఫిబ్రవరి 17:** మండలంలో ఉపమాక గ్రామ పంచాయతీ పరిధిలో స్మశాన వాటికలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణపు పనులను ప్రారంభించారు. ఈ పథకం ద్వారా సుమారు 14లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, గ్రామ సర్పంచ్ ప్రగడ వీరబాబు ఆధ్వర్యంలో కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు కొప్పిశెట్టి శ్రీను, పెద్దలు కోరుకొండ వరహాల రావు, బద్ది చక్రి,కొప్పిశెట్టి హరిబాబు, తోలేటి శ్రీనివాసరావు, కొంకిపూడి దొరబాబు, కొప్పిశెట్టి వాసు, పంచాయతీ వార్డు మెంబర్ పోలవరపు గోవింద్, గొరస సూర్యనారాయణ, మత్తుర్తి మన్నియ్య, ఆచారి, వీరేంద్ర కూటమి నాయకులు పాల్గొన్నారు

## మల్లెపల్లి ప్రబాకర్, సంపంగి పద్మ, నకిరకంటి చిట్టిబాబు లను పార్టీ నుండి బహిష్కరణ

- పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 17:** మూడు సంవత్సరాల కిందట సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీలో విలీనమైన క్రాంతి పార్టీకి చెందిన మల్లెపల్లి ప్రబాకర్, పార్టీ కార్యదర్శిగా ఉంటూ పార్టీ రాజకీయ, నిర్మాణ వ్యతిరేక పనివిధానానికి పాటుపడుతున్న క్రమంలో సోమవారం రోజు పార్టీ నుండి, పార్టీ భాధ్యతల నుండి తొలగించడం జరిగిందని పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి మంగళవారం రోజు పంపిన పత్రిక ప్రకటనలో వెల్లడించారు. పార్టీలో ప్రబాకర్ అరాచక చర్యలకు వంతపాడుతున్న పిఓడబ్ల్యూ(విముక్తి) జాతీయ కన్వీనర్ సంపంగి పద్మలతో పాటు తెలంగాణ రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి నకిరేకంటి చిట్టిబాబు లను చంద్రపుల్లారెడ్డి పార్టీ, ప్రజా సంఘాల నుండి భహిష్కరణకు గురిచేస్తున్నామని ప్రకటించారు. పార్టీ శ్రేణులు, ఇలాంటి రాజ్యం ఏర్పాటు చేసిన విప్లవ వ్యతిరేక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. వీరు చేసే తప్పుడు ప్రకటనలను, ప్రచారాలను నమ్మరాదని కోరారు. ఇటీవల సిరిసిల్ల పోలీసులు అరెస్టుచేసిన నకిలీ నక్సలైట్ల ఘటన నేపథ్యంలో తీవ్రంగా బెంబేలెత్తిపోయి, చివరికి అందరికి అందరు అధికార, ప్రతిపక్ష కాంగ్రెస్, బీ.ఆర్.ఎస్. పార్టీలలోకి వెళ్ళడానికి సిద్ధపడ్డారని అన్నారు. ఇలాంటి నేడు అసలైన చంద్రపుల్లారెడ్డి పార్టీ వారసులుగా చెప్పుకొంటూ, నిజమాబాద్, అదిలాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట తధితర ప్రాంతాల్లో పార్టీ పేరుచెప్పి అక్రమ దందాలు, ఆర్థిక వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇలాంటి విప్లవ ప్రతిఘాత శక్తులు పనిగట్టుకుని చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని హితువు చెప్పారు. లేనియెడల విప్లవ ప్రజానీకమే తగిన బుద్ది చెప్పుతారని ఈసందర్భంగా హెచ్చరించారు. పార్టీ, ప్రజాసంఘాలకు చెందిన శ్రేణులు అన్నిరకాల దిగజారి చేస్తున్న ఇలాంటి చౌకబారు, నీతిబాహ్య ప్రచారాలను ఎప్పటికప్పుడు ముక్త కంఠంతో ఖండించాలని సూచించారు.

## ప్రతి విద్యార్థి చదివేలా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బోధన ప్రక్రియలు నిర్వహించాలి-


అడిషనల్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ







**పెన్ సత్తా, ఫిబ్రవరి 17: ప్రతినిధి :** ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలలోని మండల విద్యాశాఖ అధికారులు మరియు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో అడిషనల్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ ఒక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.దీనికి జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి చైతన్యజైని అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ గారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదివేలా ప్రతి టీచర్ బాధ్యత వహిస్తూ బోధన అభ్యసన ప్రక్రియలను నిర్వహించాలని కోరారు. అదేవిధంగా వారి వారి పాఠశాలల్లో జరుగుతున్న ఎవ్రీ చైల్డ్ రైట్స్ అనే కార్యక్రమం ప్రగతిని సమీక్షించారు. అదేవిధంగా ఫౌండేషనల్ లీటరసీ మరియు న్యూమరసికి సంబంధించి మరియు ఎఫ్ ఎల్ ఎన్ శాంపిల్ స్టడీ కు సంబంధించి మరియు ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ కు సంబంధించినటువంటి పలు కీలక సూచనలు చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్ రెడ్డి మరియు ఏడు మండలాల విద్యాశాఖ అధికారులు మరియు ఏడు మండలాలకు సంబంధించిన ప్రాథమిక పాఠశాలల హెచ్ ఎమ్ లు పాల్గొన్నారు

## సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుల మందు సేవించిన వెంకన్న...



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 17:** బూర్గంపాడు మండలం, సారపాక మేదే కాలనీలో నివసిస్తున్న లాకవత్ వెంకన్న ఆత్మహత్యాయ త్నాని కి పాల్పడిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. గతంలో సారపాకలో ఆటో నడుపుతూ జీవనం సాగించిన వెంకన్న, ఉపాధి కోసం హైదరాబాద్ కు వెళ్లి కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ మధ్య తన భార్య వేరే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకున్న విషయం తెలిసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై నిలదీయడంతో తనపై కేసులు పెట్టి వేధింపులకు గురి చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తీవ్ర మనస్తాపానికి గురైన వెంకన్న సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుల మందు సేవించినట్లు సమాచారం. అతడిని వెంటనే భద్రాచలం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి..
## రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




**ఖమ్మం, పెన్ సత్తా, ఫిబ్రవరి 17:** ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓ., ఏ.ఈ.ఆర్.ఓ లతో ప్రత్యేక సమగ్ర సవరణకు ముందుగా చేపట్టిన మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులకు సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి తిరిగి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఇందుకు గాను గ్రామ పాలన అధికారులు, ఇతర అధికారులను బూత్ స్థాయి అధికారులకు మ్యాపింగ్ లో సహాయకులుగా నియమించి మ్యాపింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి పార్టీ నుంచి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని, బూత్ స్థాయి అధికారుల పర్యవేక్షకులు, ఏఈఆర్ఓ లు వారికి మ్యాపింగ్ చేయడంలో సహాయ సహకారాలు అందించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జరిగేలా పకడ్బందీగా ప్రక్రియ చేయాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు తెలిసేలా ప్రచారం నిర్వహించాలని, పెండింగ్ లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులతో మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించేలా పర్యవేక్షిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, తహశీల్దార్లు ఆనంతుల రమేష్, అరుణ, ఎన్నికల డిటి అన్సారీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన సర్పంచ్



**చింతకాని పెన్ సత్తా, ఫిబ్రవరి 17: ప్రతినిధి.** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలి పనులను ఈరోజు మత్కేపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి కంచం ద్రౌపతి పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కూలీ పని ప్రదేశంలో రోజుకు కనీసం 4 గంటలు క్రమంగా పని చేసి ప్రభుత్వం నిర్ణయించిన ₹306 కనీస వేతనాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
అలాగే ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కూలీలకు తాగునీరు, నీడ, అవసరమైన మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.
ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.ఆర్.కె. రెడ్డి , టెక్నికల్ అసిస్టెంట్ వెంకట రమణ , ఫీల్డ్ అసిస్టెంట్ బండి అప్పారావు మరియు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## జవహర్ నగర్ లో ఘనంగా కెసిఆర్ గారి జన్మదిన వేడుకలు

**జవహర్ నగర్ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కేక్లు కట్ చేసుకుని సంబరాలు జరుపుకున్నారు**



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పెన్ సత్తా, ఫిబ్రవరి 17:** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జవహర్ నగర్ అంబేద్కర్ స్టాచ్ వద్ద బిఆర్ఎస్ పార్టీ జవహర్ నగర్ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రదాత, బంగారు తెలంగాణ నిర్మాత, జనహృదయనేత, తెలంగాణ జాతిపిత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారి జన్మదిన వేడుకలను జవహర్ నగర్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్ గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, టపాసులు కాల్చి ఆనంద ఉత్సవాలు జరుపుకోవడం జరిగింది ఈ సందర్భంగా కొండలు ముదిరాజ్ మాట్లాడుతూ ఆ దేవుని ఆశీస్సులతో ఇలాంటి పుట్టినరోజులు కెసిఆర్ గారు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య, మాజీ కార్పొరేటర్లు, బి ఆర్ ఎస్ కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## నిబంధనల మేరకు అత్యధిక పరిహారం...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- సింగరేణి మండలం బాజు మల్లాయి గూడెం, రేలకాయపల్లి గ్రామాల భూ నిర్వాసిత రైతులతో చర్చించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం, పెన్ సత్తా, ఫిబ్రవరి 17::** సీతారామ ఎత్తిపోతల పథకం సంబంధించి భూ సేకరణకు నిబంధనల మేరకు అత్యధిక పరిహారం మంజూరు చేసి, భూనిర్వాసితుల ఖాతాలకు జమచేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ మంగళవారం సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయలపల్లి గ్రామాలలో సీతారామ ఎత్తిపోతల పథకం నిమిత్తం భూ సేకరణ కు సంబంధిత రైతులతో జిల్లా కలెక్టర్ చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సింగరేణి మండలం బాజు మల్లాయిగూడెం, రేలకాయపల్లి గ్రామాలలో సీతా రామ ఎత్తిపోతల పథకం 13వ ప్యాకేజీ నిర్మాణంలో భాగంగా భూ సేకరణ చేయాల్సి ఉండగా, భూ సర్వే నిర్వహించి అవార్డులు ప్రకటించామని, ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించామని అన్నారు. ప్రాజెక్ట్ రావాలని, అదేవిధంగా రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి, భూసేకరణ చేయాలని ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ప్రాజెక్టుతో సాగునీరు అంది, అక్కడి భూములు సారవంతం అవుతాయన్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమిలో ఉన్న వ్యవసాయ పంపు సెట్ల, చెట్లు, సుబాబుల్ చెట్లు, ఇతర నిర్మాణాలకు సెపరేట్ గా పరిహారం అందించామని అన్నారు. సుబాబుల్ చెట్లకు అటవీ శాఖ చే అంచనాలు చేయించి, పరిహారం అందించామన్నారు. రైతుల కోరిక మేరకు అటవీశాఖ అధికారులచే మరోసారి పరిశీలనలు చేసి, సుబాబుల్ చెట్ల విషయమై తగు న్యాయం చేస్తామన్నారు. కలెక్టర్ గా తనకున్న అధికారాలు, ప్రభుత్వ నిబంధనల మేరకు గరిష్ట పరిహారం అందజేసినట్లు, భూ నిర్వాసిత రైతులందరూ అంగీకరించి, భూ సేకరణకు సహకరించాలని, పనులకు ఆటంకం కల్గించవద్దని కలెక్టర్ అన్నారు.ఈ సమావేశంలో ఎస్.డి.సి. ఎం. రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, ఇర్రిగేషన్ ఇఇ కె. బాబూరావు, డిఇ ఎస్. కిషోర్, సింగరేణి మండల తహసీల్దార్ ఆనంతుల రమేష్, నిర్వాసిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత.

పారిశ్రామికవేత కాంగ్రెస్ నాయకులు పులిపలుపుల రాములు గౌడ్.



**వలిగొండ మండలం పెన్ సత్తా, ఫిబ్రవరి 17:** మండలంలోని ఏం తుర్కపల్లి గ్రామానికి చెందిన తోటకూర అయిలయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో మొగిలిపాక స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఈ విషయాన్ని పారిశ్రామికవేత కాంగ్రెస్ నాయకులు పులిపలుపుల రాములు గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు.స్పందించిన ఆయన మృతుడు అయిలయ్య కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా పంపించారు. ఈ మేరకు మంగళవారం మొగిలి పాక గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తుర్కపల్లి గ్రామంలోని మృతుని ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో మొగిలిపాక గ్రామ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు మొగిలిపాక రాంబాబు ఉపాధ్యక్షులు చెన్నారం మహేష్ ఉక్కుర్తి నవీన్ బజరంగ్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నాగులవంచ రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం.



**చింతకాని పెన్ సత్తా, ఫిబ్రవరి 17: ప్రతినిధి.** మండల పరిధిలోని నాగులవంచ రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలోమధిరవ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ విజయ్ చంద్ర మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, రైతులు ఫార్మర్ రిజిస్టర్ తమ పేరు నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. రైతులు తమ అవసరానికి తగ్గట్లు మాత్రమే యూరియాని వాడాలని,అధిక మొత్తంలో వాడకూడదని దానివల్ల నష్టం జరుగుతుందని ఆయన వివరించారు. నానో యూరియానుఉపయోగించడం వలన అధిక లాభాలు ఉన్నాయని రైతుల ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని ఆయనకోరారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారినిమానస,నాగులవంచ గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి, ఉప సర్పంచ్ అంబటి శరత్, మండల వ్యవసాయ విస్తరణ అధికారి బి కళ్యాణి,రైతులు నారగాని శ్రీనివాసరావు,ఆలస్యం బసవయ్య,అంబటి శాంతయ్య, ముత్తినేని వెంకటేశ్వరరావు, ఆలస్యం రవి,ఆలస్యంశ్రీనివాసరావు,ఎల్లంపల్లి సతీష్,తోటకూరి నాగేశ్వరరావు, నెల్లూరు రమేష్,అంబటిసత్యనారాయణ, గార్లపాటి కాంతారావు, వినోబా, రాములు తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ దిగొచ్చిన బంగారం ధర



వివాహాలు, శుభకార్యాల సీజన్ మొదలైన వేళ బంగారం ధరలు ఒక్కసారిగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకున్న పరిణామాల ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు వరుసగా రెండో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. ఇవాళ హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధరపై ఏకంగా రూ.1,530 తగ్గి రూ.1,54,910 వద్ద కొనసాగుతోంది. గడచిన రెండు రోజుల్లో రూ.2,840 మేర ధర తగ్గడం విశేషం. ఇక అభరణాల తయారీలో వినియోగించే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధరపై రూ.1,400 తగ్గి రూ.1,42,000కు చేరింది. బంగారంతో పాటే వెండి ధర కూడా భారీగా పతనమై కేజీ ధర రూ.2,65,000 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 5 వేల డాలర్ల మార్కు నుంచి 4,930 డాలర్ల స్థాయికి పడిపోవడంతో దేశీయంగా కూడా ధరలు దిగొచ్చాయి. దానికి తోడు డాలర్ విలువలో మార్పులు కూడా బులియన్ మార్కెట్‌పై ప్రభావం చూపాయి.

## ఎప్‌స్టీన్ ఫైల్స్ ఎఫెక్ట్.. హయత్ హోటల్స్ చైర్మన్ థామస్ ప్రిట్జ్కర్ రాజీనామా




ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోన్న విషయం తెలిసిందే. ఇప్పటికే చాలామంది ప్రముఖుల పేర్లు ఇందులో బహిర్గతమయ్యాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హయత్ హోటల్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, బిలియనీర్ థామస్ ప్రిట్జ్కర్ పేరుకు కూడా బయటకు వచ్చింది. దీంతో ఆయన తన పదవికి, బోర్డు సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లుగా ప్రకటించారు. లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో తనకు ఉన్న సంబంధాలపై వస్తున్న వరుస కథనాల నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా జెఫ్రీ ఎప్‌స్టీన్ అతడి గర్ల్‌ఫ్రెండ్ గిస్లైన్ మాక్స్‌వెల్‌తో పరిచయాలు పెంచుకుని తాను తప్పు చేశానని థామస్ ప్రిట్జ్కర్ అంగీకరించారు. 2008లో జెఫ్రీ ఎప్‌స్టీన్ లైంగిక నేరస్థుడిగా నిర్ధారణ అయిన తర్వాత కూడా అతడితో ప్రిట్జ్కర్ ఈ-మెయిల్ ద్వారా సంభాషణలు జరిపినట్లుగా ఇటీవల బయటపడిన 'ఎప్‌స్టీన్ ఫైల్స్'లో వెల్లడైంది. కాగా, జెఫ్రీ ఎప్‌స్టీన్ బాధితురాలైన వర్జీనియా గిఫ్రే 2016లో ఇచ్చిన ఒక డిపాజిషన్‌లో ప్రిట్జ్కర్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఎప్‌స్టీన్ తనను ప్రిట్జ్కర్ వద్దకు పంపించాడని ఆమె పేర్కొన్నారు. అయితే, ఈ లైంగిక వేధింపుల ఆరోపణలను ప్రిట్జ్కర్ మొదటి నుంచీ తీవ్రంగా ఖండిస్తూనే ఉన్నారు. రాజీనామా సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెఫ్రీ ఎప్‌స్టీన్, మాక్స్‌వెల్ వల్ల బాధితులకు జరిగిన అన్యాయానికి తాను ఎంతగానో విచారిస్తున్నానని అన్నారు. వారితో సంబంధాలు కొనసాగించినందుకు ఎటువంటి సాకులు చెప్పనని పేర్కొన్నారు. హయత్ హోటల్స్ ప్రయోజనాల దృష్ట్యా తాను అన్ని బాధ్యతల నుంచి తప్పుకుంటున్నానని థామస్ ప్రిట్జ్కర్ స్పష్టం చేశారు.

## 'టాటా సన్స్' కీలక నిర్ణయం..




ఎయిరిండియా యాజమాన్యం టాటా సన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. సంస్థ ఎదుర్కొంటున్న నియంత్రణ పరమైన అడ్డంకులను అధిగమించేందుకు మాజీ పౌర విమానయాన శాఖ కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఖరోలాను సీనియర్ అడ్వైజర్‌గా నియమించింది. 1988 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన ప్రదీప్ సింగ్ ఖరోలా గతంలో పౌర విమానయాన శాఖ కార్యదర్శిగా పనిచేశారు. అంతేకాకుండా, ఎయిరిండియా ప్రభుత్వ హయాంలో ఉన్నప్పుడు దాని విక్రయ ప్రక్రియలో కీలక పాత్ర పోషించారు. అయితే, ప్రస్తుతం ఎయిరిండియా, విస్తారా ఎయిర్‌లైన్స్ విలీన ప్రక్రియ తుది దశలో ఉంది. ఈ క్రమంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (ఆఉఅం), పౌర విమానయాన శాఖ నుంచి వచ్చే నిబంధనలు, అనుమతులు, వ్యూహాత్మక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో ఖరోలా అనుభవం టాటా గ్రూప్‌కు ఎంతగానో తోడ్పడనుంది. ఎయిరిండియా కార్యకలాపాలను మరింత మెరుగుపరచడం, ప్రభుత్వ విభాగాలతో సమన్వయం పెంచుకోవడంలో ప్రదీప్ సింగ్ ఖరోలా నియామకంలో కీలక కానుంది.

## 'ఎక్స్' సేవల్లో భారీ అంతరాయం..

ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజ ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (ట్విట్టర్) సేవలు సాయంత్రం ప్రపంచవ్యాప్తంగా స్తంభించింది. భారత్‌తో పాటు అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో వేలాది మంది వినియోగదారులు తీవ్ర సాంకేతిక సమస్యలను ఎదుర్కొన్నారు. యాప్, వెబ్‌సైట్.. రెండింటిలోనూ ఈ అంతరాయం కలగడంతో యూజర్లు గందరగోళానికి గురయ్యారు. ప్రముఖ వెబ్‌సైట్ 'డౌన్‌డెటెక్టర్' గణాంకాల ప్రకారం.. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 6:40 గంటల సమయంలో ఈ సమస్య మొదలైంది. కేవలం కొద్ది నిమిషాల్లోనే 25,000కు పైగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్లాట్‌ఫామ్‌ను యాక్సెస్ చేయడంలోనూ, కొత్త పోస్టులను లోడ్ చేయడంలోనూ సమస్యలు తలెత్తుతున్నట్లు వినియోగదారులు ఫిర్యాదు చేశారు. మరికొందరు లాగిన్ క్రెడెన్షియల్స్ పనిచేయడం లేదని పేర్కొన్నారు. అంతరాయానికి గల ఖచ్చితమైన కారణాలు ఇప్పటి వరకు తెలియరాలేదు. సాంకేతిక సమస్యపై 'ఎక్స్' సంస్థ ప్రతినిధుల నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఒకేసారి ఈ సమస్య తలెత్తడం చూస్తుంటే, ఇది కేంద్రీకృత సర్వర్ సమస్య అయి ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నట్లు జాతీయ మీడియా చెబుతోంది. 'ఎక్స్' ప్లాట్‌ఫామ్‌కు అంతరాయం కలగడం ఇదే మొదటిసారి కాదు. గత మార్చి 2025 లో కూడా ఇలాగే భారీ స్థాయిలో సేవలు నిలిచిపోయాయి. గతేడాది 2024 నవంబర్‌లో క్లౌడ్‌ఫ్లేర్ సర్వీసుల్లో తలెత్తిన సమస్య వల్ల 'ఎక్స్' సహా పలు వెబ్‌సైట్లు మొరాయించాయి. ప్రస్తుతం సేవలు నెమ్మదిగా పునరుద్ధరించబడిన్నట్లు జాతీయ మీడియా సమాచారం అందుతోంది.


# మూడో నెలలోనూ పెరిగిన టోకు ధరలు



దేశంలో టోకు ధరల ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) వరుసగా మూడో నెలలోనూ పెరిగింది. కేంద్ర పరిశ్రమల శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది జనవరి నెలలో టోకు ద్రవ్యోల్బణం 1.81 శాతానికి చేరింది. ప్రధానంగా ఆహార పదార్థాలు, ఆహారేతర వస్తువులు, తయారీ రంగ ఉత్పత్తుల ధరలు పెరగడమే ఇందుకు కారణమని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇంతక్రితం డిసెంబర్‌లో డబ్ల్యూపీఐ 0.83 శాతంగా ఉంది. డిసెంబర్‌లో మైనస్ 0.43 శాతంగా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం.. జనవరిలో ఒక్కసారిగా 1.55 శాతానికి ఎగబాకింది. ముఖ్యంగా కూరగాయల ధరలు ఎగిసిపడ్డాయి. డిసెంబర్‌లో మైనస్ 3.50 శాతంగా ఉన్న కూరగాయల ధరలు అమాంతం జనవరిలో 6.78 శాతం ప్రియమయ్యాయి. ప్రాథమిక లోహాలు, వస్త్రాలు, ఇతర తయారీ ఉత్పత్తుల ధరలు పెరగడంతో ఈ విభాగంలో ద్రవ్యోల్బణం 1.82 శాతం నుంచి 2.86 శాతానికి పెరిగింది. అహారేతర వస్తువుల ద్రవ్యోల్బణం జనవరిలో అత్యధికంగా 7.58 శాతానికి ఎగిసింది. ఇంతక్రితం నెలలో ఇది కేవలం 2.95 శాతంగా ఉండటం విశేషం. కాగా.. ఇంధనం, విద్యుత్ రంగం సూచీ మాత్రం డిసెంబర్‌లో మైనస్ 2.31 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం జనవరిలో మరింత తగ్గి మైనస్ 4.01 శాతానికి చేరాయి. గత వారం విడుదలైన గణాంకాల ప్రకారం రిటైల్ ద్రవ్యోల్బణం కూడా జనవరిలో స్వల్పంగా పెరిగి 2.75 శాతానికి చేరింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధానంగా రిటైల్ ద్రవ్యోల్బణం ఆధారంగానే వడ్డీ రేట్లను నిర్ణయిస్తుంది. ప్రస్తుతం ధరలు నెమ్మదిగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ నెల ప్రారంభంలో జరిగిన సమీక్షలో ఆర్బీఐ కీలక వడ్డీ రేట్లను 5.25 శాతం వద్ద యథాతథంగా కొనసాగించింది. ముందుముందు

ఆహార పదార్థాల ధరలు మరింత పెరిగితే.. ఆర్బీఐ తన పరపతి విధానంలో కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

# భారత్‌లో కొత్త కార్యాలయం ప్రారంభించిన ఆంథ్రోపిక్




భారత్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో ప్రపంచ స్థాయిలో ప్రభావం చూపుతూ దేశంలోనే తొలిసారి అంతర్జాతీయ ఏఐ సదస్సు 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గ్లోబల్ ఏఐ కంపెనీ ఆంథ్రోపిక్ బెంగళూరులో తన కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. అత్యాధునిక టెక్నాలజీ కోసం డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించే క్రమంలో ఆంథ్రోపిక్ ఈ నిర్ణయం తీసుకుంది. బెంగళూరులోని కార్యాలయం టోక్యో తర్వాత ఆసియా-పసిఫిక్‌లో రెండో కార్యాలయమని చెబుతోంది. భారత మార్కెట్ ఆంథ్రోపిక్‌కు రెండో అత్యధిక యాక్టివ్ యూజర్లు ఉన్న ప్రాంతం. కొత్త కార్యాలయం ద్వారా కంపెనీ దేశీయంగా విద్య, వ్యవసాయం, డిజిటల్ సేవలతో పాటు వివిధ రంగాల్లో కార్యకలాపాలను పెంచాలని భావిస్తోంది. భారత మార్కెట్లో సురక్షితమైన, విశ్వాసంతో కూడిన ఏఐ సొల్యూషన్స్ అందించేందుకు పనిచేస్తాం. ముఖ్యంగా బాధ్యతాయుత ఏఐ అభివృద్ధి, వినియోగంపైనే తమ దృష్టి ఉంటుందని, ఏఐ ఉత్పాదకతను పెంచే సాధనంగా మాత్రమే కాకుండా సమాజానికి మేలు చేసేలా ఉపయోగించాలని ఆంథ్రోపిక్ పేర్కొంది.

# 2035కు రూ.215 లక్షల కోట్ల రిటెయిల్ విపణి



మన దేశ భారత రిటెయిల్ రంగ విపణి పరిమాణం 2035 నాటికి రూ.210-215 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని ఓ నివేదిక తెలిపింది. 2025లోని రూ.90- 95 లక్షల కోట్ల స్థాయితో పోలిస్తే, ఈ విలువ రెట్టింపు కంటే ఎక్కువ. దిగ్గజ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలకు మించి భారత్ రాణిస్తుండటం, మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశలో సాగుతుండటం ఇందుకు కారణమవుతుందని ఆ నివేదిక వివరించింది. 'రిటెయిల్ లీడర్‌షిప్ సదస్సు- 2026'లో బోస్టన్ కన్సల్టింగ్ గ్రూపు (బీసీజీ), రిటెయిలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (రాయ్) సంయుక్తంగా ఈ నివేదికను విడుదల చేశాయి. మలివిడత వృద్ధి పథంలో భారత రిటెయిల్ రంగం సాగుతోందని నివేదిక తెలిపింది. క్రమశిక్షణతో వ్యూహాల అమలుపై దృష్టి సారించే కంపెనీలు విజయం సాధిస్తాయని, కృత్రిమ మేధ సాంకేతికతను అందిపుచ్చుకోవడమూ ముఖ్యమేనని పేర్కొంది. వినియోగదారులతో సత్సంబంధాలు, కార్యకలాపాల విధానాలు, నైపుణ్యం లాంటి విభాగాల్లో వ్యవస్థాగత మార్పులకు ప్రాధాన్యమిచ్చే రిటెయిల్ సంస్థలు.. అత్యధిక మార్కెట్ వాటా సొంతం చేసుకోగలిగే స్థితిలో ఉంటాయని వివరించింది.

# రష్యా చమురు కొనుగోలు నిలిపేస్తామని భారత్ మాకు హామీ ఇచ్చింది



భారత్-అమెరికా మధ్య ఇటీవలే ఒప్పందం కుదిరిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు.. భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేయదని అమెరికా చెప్పింది. దీనిపై భారత్ ఎలాంటి ప్రకటన చేయకపోయినా రష్యా మాత్రం భారత్ మాకు ఆ విషయం చెప్పలేదని తేల్చింది. ఆ తర్వాత ఎక్కడి నుంచి భారత్ చమురు కొనుగోలు చేసినా తమకు ఏ ఇబ్బంది లేదని చెప్పింది. ఈక్రమంలోనే అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో మరోసారి ఈ విషయంపై స్పందించారు. ముఖ్యంగా రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపి వేసేందుకు భారత్ సిద్ధంగా ఉందంటూ తాజాగా ప్రకటించారు. జర్మనీలోని మ్యూనిక్ భద్రతా సదస్సులో ప్రసంగించిన ఆయన.. ఈ విషయంలో ఢిల్లీ నుంచి తమకు స్పష్టమైన హామీ లభించిందని ధృవీకరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్ గురించి మాట్లాడుతూ.. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఆపివేసేందుకు మోదీ ప్రభుత్వం అంగీకరించిందని ప్రకటించారు. అయితే ఈ ఒప్పందానికి ప్రతిఫలంగా భారత్‌కు అమెరికా బంపర్ ఆఫర్ ప్రకటించింది. భారతీయ ఉత్పత్తులపై గతంలో విధించిన 50 శాతం సుంకాలను 18 శాతానికి తగ్గిస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. దీంతో భారతీయ ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్లో మంచి డిమాండ్ లభిస్తోంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పటి నుంచి భారత్ తన వైఖరిని స్పష్టంగా చెప్తూ వస్తోంది. తక్కువ ధరకు లభించే రష్యా చమురును కొనుగోలు చేయడం ద్వారా తన దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడమే తమ ప్రాధాన్యత అని ఢిల్లీ వాదిస్తూ వచ్చింది. అయితే అమెరికాలో ట్రంప్ అధికారంలోకి వచ్చాక సమీకరణాలు వేగంగా మారాయి. అయితే వాణిజ్య యుద్ధం కంటే సహకారం మేలని భావించిన అగ్రరాజ్యం.. చమురు దిగుమతులపై ఆంక్షలు పెట్టేందుకు భారత్‌ను ఒప్పించడంలో సఫలీకృతమైందని రూబియో మాటల ద్వారా అర్థం అవుతోంది. రష్యా చమురును నిలిపివేయడం వల్ల భారత్‌కు కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ.. అమెరికా మార్కెట్లో లభించే సుంకాల మినహాయింపు ఆ నష్టాన్ని పూడ్చుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

పెన్ సత్తా
ఎడిటోరియల్

## సర్వదేవతావ్రతాల పూజలకు ఉద్దిష్టం ఫాల్గుణం

శ్రీమహావిష్ణువుకు ఇష్టమైన మాసాల్లో ఫాల్గుణం ఒకటి. పూర్ణిమ తిథిలో చంద్రుడు పూర్వ ఫల్గుణి లేదా ఉత్తర ఫల్గుణి నక్షత్ర సమీపంలో సంచరిస్తే, ఆ మాసాన్ని 'ఫాల్గుణి'గా పరిగణిస్తారు. ప్రధానంగా విష్ణు ప్రీతికరం అంటోంది భాగవతం. చైత్రాది మాసాల క్రమంలో చిట్ట చివరిది ఫాల్గుణం. ఇంతకు ముందు పదకొండు నెలల్లో చేసిన దేవతా పూజలు, వ్రతాలు ఈ చివరి మాసంలో మరో సారి ఆచరించడం విశేషం. అందుకే సర్వ దేవతా వ్రత సమాహారంగా, సర్వవ్రత సింహావ లోకనంగా కనిపిస్తుంది ఫాల్గుణ మాసం. ఫాల్గుణ మాసంలో ప్రతి తిథికీ ఒక ప్రత్యేకత ఉంది. ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుంచి పన్నెండు రోజులు పయోవ్రతం ఆచరించి మహా విష్ణువుకు క్షీరాన్నం నివేదిస్తే అభీష్ట సిద్ధి కలుగుతోందని భాగవత పురాణం వివరిస్తోంది. ఆదితి పయోవ్రతం ఆచరించి వామనుడిని పుత్రుడిగా పొందింది. విష్ణుపూజకు 'పయోవ్రతం' విశిష్టమైంది. దీన్ని శుద్ధ పాడ్యమి నాడు ప్రారంభించి పన్నెండు రోజుల పాటు కొనసాగిస్తారు. సమీపంలోని నదుల్లో స్నానమాచరించి, సూర్యుడికి అర్ఘ్యమిచ్చి, విష్ణువును షోడశోపచారాలతో పూజించి, పాలను నైవేద్యంగా సమర్పించడం సంప్రదాయం. పయస్సు అంటే పాలు. అదితి ఈ వ్రతం ఫలితం వల్లే వామనుడు జన్మించాడట. హరిహరసుతుడు అయ్యప్ప స్వామి, పాలకడలి నుంచి లక్ష్మీదేవి ఇదే మాసంలో జన్మించారు. ఇక మహాత్ములైన శ్రీకృష్ణ చైతన్యులు, రామకృష్ణ పరమహంస, స్వామి దయానంద సరస్వతిలు జననం కూడా ఈ మాసంలోనే జరిగింది. అర్జునుడి జన్మ నక్షత్రం కూడా ఇదే కాబట్టి 'ఫల్గుణ' అనే పేరుంది. కురు పాండవుల్లో కొందరు ఫాల్గుణ మాసంలో జన్మించినట్లు చెబుతారు. ఫాల్గుణ బహుళ అష్టమినాడు ధర్మరాజు, ఫాల్గుణ శుద్ధ త్రయోదశి రోజున భీముడు, దుర్యోధనుడు, దుశ్శాసనులు జన్మించినట్లు పురాణాలు తెలుపుతున్నాయి. లక్ష్మీనారాయణులు, పార్వతీ పరమేశ్వరుల్ని శుద్ధ తదియనాడు పూజించి నైవేద్యం సమర్పిస్తారు. ఈ మాసంలో రెండు రోజులు వినాయకుణ్ని ఆరాధిస్తారు. శుక్ల పాడ్యమి, చతుర్థినాడు అవిఘ్న, పుత్ర గణపతి వ్రతాల్ని ఆచరిస్తారు. శుద్ధ ద్వాదశి పయోవ్రతానికి చివరిరోజు. ఈ రోజున నరసింహస్వామిని పూజిస్తారు. దివ్యౌషధంగా భావించే ఉసిరిని శుద్ధ ఏకాదశినాడు పూజించి, ఆ చెట్టు వద్దనే 'అమలక ఏకాదశి' వ్రతం నిర్వర్తిస్తారు. దీన్ని 'అమృత ఏకాదశి'గా పరిగణిస్తారు. మదురైలోని మీనాక్షీ సుందరేశ్వరుల కల్యాణం రోజు ఇది. అందుకే శివపూజ చేస్తారు. వసంత పంచమి నుంచి ఫాల్గుణ పూర్ణిమ ప్రకృతి ఆహ్లాదకరంగా ఉంటుంది. కనువిందు చేస్తుంది. చలి పూర్తిగా తగ్గదు. నులివెచ్చదనం ప్రాణానికి హాయి కలిగిస్తుంటుంది. ఫాల్గుణ మాసంలో అతి ముఖ్యమైంది వసంతోత్సవం. ఇది కాముని పండుగ, హోలికా పూర్ణిమ, కామ దహనం పేరుతో ప్రఖ్యాతి చెందింది. ఈ పర్వదినాన శివుడు, మన్మథుడు, కృష్ణుడు, లక్ష్మీదేవి పూజలందు కుంటారు. ఫాల్గుణ మాసంలో పూర్ణిమ రోజున హోలీ పండుగను నిర్వహిస్తుంటారు. ఈ పూర్ణిమ శక్తితో కూడినది. ఏ సంవత్సరమైనా పూర్ణిమ, ఉత్తర ఫల్గుణి కలిసి వస్తే ఆ రోజున మహాలక్ష్మిని షోడశోపచారాలతో ఆరాధించి లక్ష్మీ అష్టోత్తర శతనామాలు కనకధారా స్తోత్రాలను పారాయణం చేయడం మంచిది. హోళి రోజున లక్ష్మీదేవిని ఆరాధిస్తే సమస్త శుభములు కలుగుతాయని పెద్దలవాక్కు. కొన్ని దక్షిణాది ఆలయాలలో ఫాల్గుణ పూర్ణిమను చాలా గొప్పగా చేస్తారు. ఫాల్గుణ బహుళ పాడ్యమినాడే రావణుడితో యుద్ధానికి వానర సైన్యాన్ని వెంటబెట్టుకొని శ్రీరాముడు లంకకు వెళ్లాడు. చవితినాడు 'సంకట గణేశ' వ్రతం ఆచరిస్తారు. బహుళ అష్టమి నాడు సీతాదేవి భూమి నుంచి ఆవిర్భవించింది. ఫాల్గుణంలో గోదానం, ధనదానం, వస్త్రదానం, గోవిందుడికి ప్రీతి కలిగిస్తాయని శాస్త్రవచనం. అందుకే ఆ రోజున రామాయణాన్ని చదివి, సీతారాముల్ని కొలుస్తారు. ఫాల్గుణ బహుళ ఏకాదశినాడు రావణ కుమారుడు ఇంద్రజిత్తు, లక్ష్మణుడు మధ్య ప్రారంభమైన సమరం త్రయోదశి దాకా కొనసాగింది. రావణ బ్రహ్మను శ్రీరాముడు అమావాస్య రోజు వధించాడు. బహుళ అమావాస్య నాడు పితృదేవతలకు పిండప్రదానం చేసి, అన్నదానం చేస్తారు.

# నానబెట్టిన శనగలు తింటే.. శరీరంలో జరిగేది ఇదే..!

శనగలు ఆరోగ్యానికి చాలా మంచివి. ఈ విషయం చాలా మందికి తెలియదు. అందుకే వీటిని కేవలం గుడిలో ప్రసాదం, ఉడికించి తినే గుగ్గిలుగా చూసేవారు చాలా మంది ఉంటారు. కానీ, శనగలను ఒకరోజంతా నీళ్లలో నానబెట్టి తినడం వల్ల లెక్కలేనన్నీ ఎక్కువ లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. నానబెట్టిన నల్ల శనగల్లో యాంటీఆక్సిడెంట్లు, ఫైటోన్యూట్రియెంట్లు పుష్కలంగా ఉంటాయి. రక్తం గడ్డకట్టకుండా నిరోధించే ముఖ్యమైన ఖనిజాలు కూడా వాటిలో ఉంటాయి. శనగల్లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి మిమ్మల్ని ఎక్కువ కాలం కడుపు నిండి ఉంచుతాయి, అనారోగ్యకరమైన చిరుతిళ్లను నివారించడంలో మీకు సహాయపడతాయి. నానబెట్టిన నల్ల శనగల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. అవి జీర్ణవ్యవస్థకు కూడా సహాయపడతాయి. అవి శరీరం నుండి హానికరమైన టాక్సిన్స్ ని తొలగించి జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. నానబెట్టిన నల్ల శనగపప్పు తినడం వల్ల ఏవైనా చర్మ సమస్యలు రాకుండా ఉంటాయి. ఇది మీ చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. నానబెట్టిన నల్ల శనగల్లో యాంటీఆక్సిడెంట్లు, ఫైటోన్యూట్రియెంట్లు పుష్కలంగా ఉంటాయి. రక్తం గడ్డకట్టకుండా నిరోధించే ముఖ్యమైన ఖనిజాలు కూడా వాటిలో ఉంటాయి. శనగల్లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి మిమ్మల్ని ఎక్కువ కాలం కడుపు నిండి ఉంచుతాయి, అనారోగ్యకరమైన చిరుతిళ్లను నివారించడంలో మీకు సహాయపడతాయి. నల్ల శనగల్లో కరిగే ఫైబర్



ఉంటుంది. ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల, అవి బరువు తగ్గడంలో, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడంలో సహాయపడతాయి. నల్ల శనగలు మీ జుట్టు ఆరోగ్యానికి అవసరమయ్యే ముఖ్యమైన విటమిన్లు, పోషకాలు కలిగి ఉంటాయి. నానబెట్టిన నల్ల శనగలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల తెల్ల జుట్టు సమస్య రాకుండా ఉంటుంది. నల్ల శనగలు మన రక్తంలోకి చక్కెర శోషణను నియంత్రిస్తాయి. నల్ల శనగపప్పులోని కార్బోహైడ్రేట్లు రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించి టైప్-2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

# నల్ల పసుపును ఎప్పుడైనా తిన్నారా?



ప్రతి వంటగదిలో ఉపయోగించే పసుపు ఆహారం రంగును మార్చడమే కాకుండా, శరీరానికి చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. దీనిలో ఉన్న యాంటీమైక్రోబయల్, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు చర్మం నుండి గుండె వరకు ప్రతిదీ ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. మీరు ఎప్పుడైనా నల్ల పసుపు గురించి విన్నారా? ప్రతి వంటగదిలో ఉపయోగించే పసుపు ఆహారం రంగును మార్చడమే కాకుండా, శరీరానికి చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. దీనిలో ఉన్న యాంటీమైక్రోబయల్, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు చర్మం నుండి గుండె వరకు ప్రతిదీ ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. నల్ల పసుపు, కుర్కుమా కాసియా లేదా నల్ల పసుపు అని కూడా పిలుస్తారు. ఇది ఔషధ గుణాలతో కూడిన మొక్క. దీని లోపలి రంగు ముదురు నీలం లేదా నలుపు. దీనిని సుగంధ ద్రవ్యంగా ఉపయోగించరు. కానీ, వివిధ వ్యాధుల ఉపశమనం కోసం ఉపయోగిస్తారు. దీని వాసన పసుపు పసుపు కంటే బలంగా ఉంటుంది. దాని రుచి కొద్దిగా చేదుగా ఉంటుంది. అందుకే దీనిని వంటలో ఉపయోగించరు. పసుపులో కర్కుమిన్ ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలతో సమృద్ధిగా ఉంటుంది. అయితే, నల్ల పసుపులో కర్కుమిన్ పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. కానీ ముఖ్యమైన నూనెలు, కర్పూరం, ఫినోలిక్ సమ్మేళనాలు వంటి అంశాలు ఇందులో కనిపిస్తాయి. ఇవి గృహ నివారణలలో చాలా సహాయకారిగా ఉంటాయి. యాంటీమైక్రోబయల్ లక్షణాలు: నల్ల పసుపులో ఉండే యాంటీమైక్రోబయల్ లక్షణాలు శరీరం ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి, గాయాలను నయం చేయడానికి సహాయపడతాయి. వాపు నుండి ఉపశమనం: కీళ్ల నొప్పులు, కండరాల ఒత్తిడితో బాధపడేవారికి, దీని ఉపయోగం చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే దీనిలో ఉన్న అంశాలు మంటను తగ్గించడంలో సహాయపడతాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో నీలం పసుపు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

# కివీ రోజుకు ఒక్కటి తింటే.. ఆసుపత్రిని మర్చిపోండి!

ప్రతిరోజూ పండ్లు, కూరగాయలు తినడం వల్ల మీ ఆరోగ్యం మెరుగుపడుతుందని వైద్యులు చెప్పడం మీరు తరచుగా వినే ఉంటారు. ఈ రకమైన ఆహారం తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. కొలెస్ట్రాల్ సమస్యలు మెరుగుపడతాయి.



ఆరోగ్యకరమైన పండ్లలో కివీ కూడా ఒకటి. ఈ పండు రోజుకు ఒక్కటి తింటే చాలు.. డాక్టర్‌కి గుడ్ బై చెప్పొచ్చు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. కివి పండు చాలా మందికి నచ్చకపోయినా, ఇది పోషకాలతో నిండి ఉంటుంది. చూసేందుకు చిన్నగా ఉన్నప్పటికీ, ఇందులో విటమిన్ సి, ఫైబర్, ఫోలేట్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవన్నీ మన రోగనిరోధక శక్తిని పెంచుతాయి. జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ఆకుపచ్చ కివి పండు పోషకాలతో నిండి ఉంటుంది. యూరోపియన్ కమిషన్ ఇటీవల ఆకుపచ్చ కివి పండుపై ప్రత్యేక వ్యాఖ్యలు చేసింది. జీర్ణ ఆరోగ్యాన్ని ప్రోత్సహించే లక్షణాల కారణంగా ఇది ప్రేగు కదలికలను సాధారణీకరించడంలో సహాయపడే మొదటి పండు. సరైన మొత్తంలో కివి తినడం వల్ల ప్రేగు కదలికలను సులభతరం చేస్తుందని చెప్పారు. యూరోపియన్ యూనియన్ నిబంధనల ప్రకారం, రోజుకు దాదాపు 200 గ్రాముల ఆకుపచ్చ కివి పండ్లను తీసుకోవడం మంచిది. అంటే రెండు పెద్ద కివి పండ్లు తింటే సరిపోతుంది. సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా కివి పండ్లను తీసుకోవడం వల్ల ప్రేగులు సజావుగా పనిచేయడానికి సహాయపడుతుంది. కివి పండులో కరిగే, కరగని ఫైబర్ రెండూ ఉంటాయి. కరగని ఫైబర్ మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. ఇది ప్రేగు కదలికలను సులభతరం చేస్తుంది. అదనంగా, కివిలోని సహజ చక్కెరలు, నీటి శాతం పేగులను సున్నితంగా ప్రేరేపిస్తుంది. దీని ప్రత్యేకత ఏమిటంటే ఇది మందుల తీవ్రమైన దుష్ప్రభావాలు లేకుండా సహజంగా పనిచేస్తుంది.చాలా కాలంగా మలబద్ధకంతో బాధపడుతున్న వారికి కివి పండు ఒక గొప్ప ఔషధం.

# బాడీలో ఈ మార్పులు కనిపిస్తే వెంటనే మందు మానేయండి..

మనం తాగే ప్రతి మద్యం చుక్కా లివర్‌పై గాయంలా మారుతుందని మీకు తెలుసా..? రాత్రి తాగిన మద్యం ప్రభావం ఉదయం పూట మీ శరీరంలో కొన్ని ప్రత్యేక లక్షణాల రూపంలో కనిపిస్తుంది. ఆ సంకేతాలను నిర్లక్ష్యం చేస్తే, అది కాలేయ వైఫల్యానికి దారితీసే ప్రమాదం ఉంది. మద్యం సేవించడం అనేది ఈ రోజుల్లో ఒక సరదాగా మారిపోయింది. కానీ అది కాలేయంపై చూపే ప్రభావం మాత్రం అత్యంత భయంకరమైనది. అధికంగా మద్యం తాగడం వల్ల కాలేయంపై మచ్చలు ఏర్పడతాయి. ఇవి ఒకరకమైన గాయాల వంటివి, వీటినే వైద్య పరిభాషలో లివర్ సిర్రోసిస్ అంటారు. మీరు తక్కువ మొత్తంలో తాగినా, అప్పుడప్పుడు తాగినా అది కాలేయానికి హానికరమే. ముఖ్యంగా శరీరంలో ఈ మూడు మార్పులు కనిపిస్తే.. మీ కాలేయం ప్రమాదంలో ఉందని అర్థం. రాత్రి కొంచెం మద్యం తాగినప్పటికీ, ఉదయం నిద్రలేవగానే తల విపరీతమైన బరువుగా అనిపించడం, ఒంట్లో అస్సలు శక్తి లేకపోవడం వంటివి జరిగితే అది హెచ్చరికగా భావించాలి. ఏ పని చేయాలని అనిపించకపోవడం, నిరంతరం శరీర నొప్పులు, వికారం లేదా వాంతులు వచ్చే సూచనలు కనిపిస్తాయి. ఇవి ప్రారంభ కాలేయ వైఫల్యం సంకేతాలు. మీ కాలేయం విషతుల్యమైన



ఆల్కహాల్‌ను క్లీన్ చేయడానికి చాలా కష్టపడుతోందని దీని అర్థం. మద్యం మీ జీర్ణవ్యవస్థను పూర్తిగా దెబ్బతీస్తుంది. ఆహారం సరిగ్గా అరగకపోవడం వంటి సమస్యలు తరచుగా ఎదురవుతుంటే జాగ్రత్త పడాలి. కడుపు నొప్పి, కడుపులో గ్యాస్ పట్టేసినట్లు భారంగా అనిపించడం, తరచుగా త్రేన్పులు రావడం వంటి లక్షణాలు ఉంటాయి. జీర్ణవ్యవస్థ దెబ్బతినడం వల్ల కాలేయం తన పనితీరును నెమ్మదిస్తుంది. ఈ దశలోనూ మద్యం మానకపోతే పరిస్థితి విషమించవచ్చు. మద్యం సేవించడం వల్ల గాఢ నిద్ర పడుతుందని చాలామంది భ్రమపడుతుంటారు. కానీ వాస్తవానికి అది నిద్రను నాశనం చేస్తుంది. రాత్రిపూట తరచుగా నిద్ర భంగం కలగడం, గాఢ నిద్ర లేకపోవడం వల్ల ఉదయం నీరసంగా అనిపించడం. ఒకవేళ మీకు మద్యం తాగకుండా నిద్ర పట్టడం లేదంటే, మీరు ఆల్కహాల్‌కు బానిసయ్యారని అర్థం. ఇది కాలేయంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తుంది.

వరల్డ్ కప్ ప్రస్థానాన్ని గెలుపుతో ముగించిన నేపాల్...

# స్కాట్లాండ్‌పై సూపర్ చేజింగ్

**చివరి లీగ్ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై 7 వికెట్ల తేడాతో విజయం**

**దిపేంద్ర సింగ్ మెరుపు అర్ధశతకంతో అద్భుత ఛేజింగ్**

**వరుసగా మూడు ఓటముల తర్వాత నేపాల్‌కు ఊరట**

**స్కాట్లాండ్ బ్యాటర్ మైఖేల్ జోన్స్ 71 పరుగులు వృథా**



టీ20 వరల్డ్ కప్‌లో వరుస ఓటములతో నిరాశపర్చిన నేపాల్, తమ ప్రస్థానాన్ని గెలుపుతో ముగించింది. గ్రూప్-సిలో భాగంగా తన చివరి లీగ్ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో 171 పరుగుల భారీ లక్ష్యాన్ని నేపాల్ మరో 4 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. టోర్నీలో వరుసగా మూడు మ్యాచ్‌లలో ఓడిన నేపాల్‌కు ఇది తొలి విజయం కావడం విశేషం.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న నేపాల్‌కు స్కాట్లాండ్ బ్యాటర్లు సవాలు విసిరారు. ఓపెనర్ మైఖేల్ జోన్స్ (45 బంతుల్లో 71) అద్భుత అర్ధశతకంతో చెలరేగడంతో స్కాట్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. నేపాల్ బౌలర్లలో సోంపాల్ కామి 3 వికెట్లతో ఆకట్టుకున్నాడు.း

లక్ష్య ఛేదనలో నేపాల్‌కు ఓపెనర్లు కుశల్ భుర్టెల్ (43), ఆసిఫ్ షేక్ (33) శుభారంభం అందించారు. అయితే, స్కాట్లాండ్ బౌలర్ మైఖేల్ లీస్క్ వీరిద్దరితో పాటు కెప్టెన్ రోహిత్ పాడెల్ (16)ను కూడా ఔట్ చేయడంతో నేపాల్ 98 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన దీపేంద్ర సింగ్ ఐరీ, గుల్షన్ ఝా (24లి) మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశారు. ఐరీ కేవలం 23 బంతుల్లో 4 ఫోర్లు, 3 భారీ సిక్సర్లతో అజేయంగా 50 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. వీరిద్దరూ కలిసి నాలుగో వికెట్‌కు అబేధ్యంగా 73 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో నేపాల్ చారిత్రక విజయాన్ని అందుకుంది.

# టీ20 వరల్డ్ కప్: సూపర్-8లో టీమిండియా ప్రత్యర్థులు వీరే!

**టీ20 ప్రపంచకప్‌లో సూపర్-8 దశకు చేరిన భారత్**

**గ్రూప్ దశలో అజేయంగా నిలిచిన సూర్యకుమార్ యాదవ్ సేన**

**సూపర్-8లో దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వేలతో తలపడనున్న టీమిండియా**

**ఫిబ్రవరి 22 నుంచి భారత్‌లోనే జరగనున్న సూపర్-8 మ్యాచ్‌లు**

**అహ్మదాబాద్, చెన్నై, కోల్‌కతాలలో మ్యాచ్‌ల నిర్వహణ**



టీ20 ప్రపంచకప్ 2026లో భారత జట్టు సూపర్-8 దశకు అర్హత సాధించింది. ఆదివారం కొలంబోలో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 61 పరుగుల భారీ తేడాతో గెలిచి, గ్రూప్-ఏలో అగ్రస్థానాన్ని పదిలం చేసుకుంది. ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని జట్టు అజేయంగా నిలిచింది.

సూపర్-8 గ్రూప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌తో పాటు గత సీజన్ రన్నరప్ దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే జట్లు ఉన్నాయి. ఐర్లాండ్‌తో జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో జింబాబ్వే సూపర్-8 బెర్తును ఖాయం చేసుకుంది. సెమీఫైనల్స్‌కు చేరేందుకు ఈ దశలో గెలుపు అత్యంత కీలకం కానుంది.

**భారత సూపర్-8 మ్యాచ్‌ల షెడ్యూల్**

ఫిబ్రవరి 22 (ఆదివారం): భారత్ జం దక్షిణాఫ్రికా (నరేంద్ర మోదీ స్టేడియం, అహ్మదాబాద్)

ఫిబ్రవరి 26 (గురువారం): భారత్ జం జింబాబ్వే (ఎంఏ చిదంబరం స్టేడియం, చెన్నై)

మార్చి 1 (ఆదివారం): భారత్ జం వెస్టిండీస్ (ఈడెన్ గార్డెన్స్, కోల్‌కతా)

ఈ మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం సాయంత్రం 7:00 గంటలకు ప్రారంభమవుతాయి. ఈ కీలక పోరులన్నీ భారత్‌లోనే జరగనుండటం టీమిండియాకు కలిసొచ్చే అంశం. గ్రూప్ దశలో తన చివరి మ్యాచ్‌ను ఫిబ్రవరి 18న నెదర్లాండ్స్‌తో అహ్మదాబాద్‌లోనే ఆడనుంది. సూపర్-8 తొలి మ్యాచ్ కూడా అదే వేదికపై జరగనుండటంతో జట్టుకు సన్నద్ధమయ్యేందుకు వెసులుబాటు లభిస్తుంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీ సెమీఫైనల్స్ ముంబై, కొలంబోలో జరగనున్నాయి.



# ఆదర్శ కుటుంబంలో హాట్ బ్యూటీ!

త్రివిక్రమ్ సినిమా అంటే తారలతో తెరంతా నిండుగా కనిపిస్తుంది. ఏ పాత్రకు ఆ పాత్రను ప్రత్యేకంగా హైలైట్ చేయడం గురూజీ ప్రత్యేకత. పాత్రల ఎంపిక పరంగా బోయపాటికి సారూప్యంగా ఉన్నా? ఆయన్ని మించిన ప్రత్యేకంగా ఆ పాత్రలను తెరపై ఆవిష్కరించడం గురూజీ స్పెషలిస్ట్. అందులోనూ కుటుంబ కథా చిత్రమంటే? మరింత రంగులమయంగా ఉంటుంది. సినిమా టైటిల్ ని బట్టే పక్కా ఫ్యామిలీ స్టోరీ అని తేలిపోయింది. మల్లీశ్వరికి 2.0లా ఉంటుందనే ప్రచారం జరుగుతూనే ఉంది. ఇందులో వెంకటేష్ కు భార్య పాత్రలో శ్రీనిధి శెట్టి కనిపించనుంది.ఎంతో మంది నాయికల్ని పరిశీలించి మరీ గురూజీ శ్రీనిధిని ఎంపిక చేసాడు అంటే ఆ పాత్రలో ప్రత్యేకత తప్పనిసరి. అలాగే సినిమాలో నారా రోహిత్ కూడా కీలక పాత్ర పోషిస్తున్నాడు. అవసరం మేర సీనియర్ నటీమణుల్ని కూడా దించడం గురూజీ ప్రత్యేకత. ఇంకా ఆ పాత్రల గురించి విషయాలు బయటకు రాలేదు గానీ ఓ కీలక పాత్రకు మాత్రం హాట్ బ్యూటీ నభా నటేష్ ను ఎంపిక చేసినట్లు సన్నిహిత వర్గాల నుంచి తెలిసింది. సినిమాకు ఈ పాత్ర ఎంతో కీలకమని చెబుతున్నారు. ఇదే నిజమైతే ఈ సినిమాతో నైనా నభా నటేష్ రాత మారుతుందేమో చూడాలి.హీరోయిన్ గా టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన అమ్మడు ప్రతిభావంతురాలే. హీరోయిన్ గా అవకాశాలు కూడా బాగానే అందుకుంది. కానీ వైఫల్యాలు సొగసరిని రేసులో వెనక్కి నెట్టాయి. -ఇస్మార్ట్ శంకర్- తర్వాత నటించిన సినిమాలన్నీ ఫ్లాప్ అయ్యాయి. ప్రస్తుతం నిఖిల్ హీరోగా నటిస్తోన్న పాన్ ఇండియా చిత్రం -స్వయంభూ-లో నటిస్తోంది. కానీ ఆ సినిమా ఇంకా రిలీజ్ అవ్వలేదు. ఆశలన్నీ ఆ సినిమాపైనే పెట్టుకుంది. అయినా గురూజీ నభా నటేష్ లో ప్రతిభను గుర్తించి గొప్ప అవకాశం కల్పించాడు.

ఇలా రెండు సినిమాలు నభా చేతుల్లో ఉన్నాయి. ఇప్పటి వరకూ నభా నటేష్ సీనియర్ హీరోలతో కలిసి పనిచేసే అవకాశం దక్కలేదు. యంగ్ హీరోలతోనే సినిమాలు చేసింది. మరి వెంకీతో ఛాన్స్ నభా కెరీర్ కు టర్నింగ్ పాయింట్ లా నిలుస్తుందా? అన్నది చూడాలి. -స్వయంభు-పై కూడా అంచనాలు భారీగా ఉన్నాయి. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో మంచి బజ్ నెలకొంది. త్వరలోనే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి ఈ అవకాశాలతో అమ్మడు కెరీన్ ని ఎలా పునర్మించుకుంటుందో చూడాలి. నభా నటేష్ కెరీర్ శాండిల్ వుడ్ లో ప్రారంభించినా అక్కడ ఎక్కువ కాలం కొనసాగలేదు. టాలీవుడ్ లోనే కొనసాగుతుంది. ఇక్కడ అవకాశాలు తగ్గినా పర భాషల వైపు చూసింది లేదు.

# గందరగోళంలోకి నెట్టేసిన శ్రద్ధా



-సాహో- చిత్రంతో తెలుగు వారికి సుపరిచితమైన నటి శ్రద్ధా కపూర్. తనదైన అందం, నట ప్రతిభతో యువహృదయాలను గెలుచుకున్న ఈ బ్యూటీని ఆరాధించని బోయ్స్ లేరంటే అతిశయోక్తి కాదు. శ్రద్ధా ఇటీవల స్త్రీ2 లోను అద్భుత నటనతో ఆకట్టుకుంది. హారర్ సినిమాలో శ్రద్ధా నటనకు మంచి మార్కులే పడ్డాయి. తదుపరి క్రిష్ 4లోను శ్రద్ధా కపూర్ నటించనుంది. ఇక శ్రద్ధా నిరంతర ఇన్ స్టా పోస్టులు ఇంటర్నెట్ లో హాట్ టాపిగ్గా మారుతున్నాయి. ఈ భామ తాజాగా పింక్ ఫ్రాక్ ధరించిన ఓ అందమైన ఫోటోగ్రాఫ్ ని షేర్ చేసి, దాంతో పాటే ఒక కొటేషన్ కూడా ఇచ్చింది. --గులాబ్ అంటే గులాబీ, గులాబీలు ఎరుపు, ఎరుపు అంటే లాల్, కానీ గులాబీ అంటే పింక్? సరైన గందరగోళం-- అని ఒక కవితను రాసింది. అయితే ఈ కవిత్వం పాఠకుల్ని తీవ్ర గందరగోళంలోకి నెట్టింది. శ్రద్ధాను సోషల్ మీడియాల్లో అనుసరిస్తున్న లక్షలాది మంది కన్ఫ్యూజన్ లోకి వెళ్లిపోయారు. ఈ రంగు-పద విరుద్ధతను హైలైట్ చేసిన విధానం ఆకర్షణీయంగా ఉన్నా, శ్రద్ధా లోతైన పరిభాషను అర్థం చేసుకోవడం కుర్రాళ్ల వల్ల కాలేదు. -గులాబ్- అనే పువ్వుకు మూలం రోజ్. చాలా గులాబీలు ఎరుపు రంగులో ఉంటాయి... అని కూడా ఇందులో వివరంగా ఉంది. అయితే శ్రద్ధా విసిరిన పజిల్‌ను పూరించడానికి ప్రయత్నించిన అభిమానులు ఇంకా కన్ఫ్యూజన్ లోనే ఉన్నారు. శ్రద్ధా 9.3 కోట్ల మంది ఫాలోవర్లతో భారతీయ చిత్రపరిశ్రమలో క్రేజీ హీరోయిన్ గా వెలిగిపోతోంది.

ఈ పోస్ట్ చేసిన మొదటి 60 నిమిషాల్లోనే 10,000 కంటే ఎక్కువ కామెంట్లు వినిపించాయి.ఈ పోస్ట్ కి సోషల్ మీడియాల్లో ఫ్యాన్స్ ఛమత్కారంగా స్పందించారు. శ్రద్ధ మాత్రమే భాషా సంక్షోభాన్ని ఇంత సౌందర్యంగా కనిపించేలా చేయగలదు! అని ఒకరు రాసారు. చాలామంది ఆమె -స్త్రీ- వ్యక్తిత్వాన్ని ప్రస్తావించారు. గులాబీ-గులాబీ తర్కం కంటే ఓ -స్త్రీ- రహస్యాన్ని కనుగొనడం సులభం అని కొందరు సరదాగా వ్యాఖ్యానించారు. మొత్తానికి శ్రద్ధా ఫజిల్ తాలూకా గందరగోళం నుంచి బయటపడటం ఎవరి వల్లా కాలేదు!

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com